జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*
https://prajapalana.com/epaper.php
సంపుటి 7 సంచిక 72 | హైదరాబాద్, మే 28 ఆదివారం 2023 | 8 పేజీలు | వెల : 5.00

ప్రజాపాలన
నిజాయితీ, నిబద్ధతతో జర్నలిస్టుగా పనిచేయాలనుకొంటున్నారా?
మీ ఏరియాలోని ప్రజల సమస్యలను మీ కలం ద్వారా ప్రభుత్వదృష్టికి తీసుకువెళ్లాలి అనుకుంటున్నారా ?ఇంకెందుకు ఆలస్యం మీ ఏరియాకు మీరే రిపోర్టర్... రండి ..ప్రజాపాలన దినపత్రిక మీకు అవకాశం కల్పిస్తుంది
వివరాలకు సంప్రదించండి 8886022523


# దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ..?
## కేంద్రం విధానాలపై సీఎంలు సీరియస్?!



ఢిల్లీ: దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తోందని, రాష్ట్రాల అధికారాలను కేంద్రం తన చెప్పుచేతల్లోకి తీసుకుంటోందని ఎనిమిది రాష్ట్రాల సీఎంలు మండిపడ్డారు. ఈ క్రమంలో శనివారం జరిగిన నీతి ఆయోగ్ భేటీకి మూకుమ్మడిగా డుమ్మా కొట్టారు. అంతేకాకుండా ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వానికే కీలక అధికారులు ఉంటాయన్న సుప్రీంకోర్టు నిర్ణయాన్ని తుంగలో తొక్కి ఢిల్లీపై అధికారం చెలాయించాలని చూస్తున్న మోదీ ప్రభుత్వంపై నిరసన వెలిబుచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకురావడాన్ని తప్పుపట్టారు. ఈ క్రమంలోనే నూతన పార్లమెంట్ భవన ప్రారంభోత్సవానికి కూడా హాజరుకాలేమని 21 ప్రతిపక్ష పార్టీలు ఖరాకండిగా తేల్చి చెప్పేశాయి. నీతి ఆయోగ్ ఎనిమిదవ పాలక మండలి భేటీకి బీజేపీయేతర పాలిత రాష్ట్రాలకు చెందిన ఎనిమిది మంది సీఎంలు హాజరవ్వలేదు. శనివారం జరిగిన ఈ సమావేశాన్ని వారు బహిష్కరించడంతో భారత రాజకీయాల్లో విభేదాలు తీవ్రమయ్యాయి. అంతేకాకుండా మే 28న జరగనున్న కొత్త పార్లమెంట్ భవన ప్రారంభోత్సవాన్ని కూడా బహిష్కరించాలని 21 ప్రతిపక్ష పార్టీలు నిర్ణయించాయి.

(మిగతా 2లో..)

### కొత్త పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవానికి ...
# కౌంట్‌డౌన్
## ప్రధాని మోడీ చేతుల మీదుగా..
## ఆవిష్కృతం కానున్న కొత్త పార్లమెంట్..





ఢిల్లీ: కొత్త పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవానికి కౌంట్‌డౌన్ ప్రారంభమయ్యింది. ఉదయం ఏడున్నరకు ప్రారంభమయ్యే కార్యక్రమం మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగుతుంది. విపక్ష నేతలు ఈ కార్యక్రమాన్ని బహిష్కరించడంపై మండిపడింది బీజేపీ. ప్రజాస్వామ్యాన్ని , రాజ్యాంగాన్ని అగౌరవపరుస్తున్నారని విమర్శించింది. భారత కొత్త పార్లమెంట్ మరికొన్ని గంటల్లో ఆవిష్కృతం కానుంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అధ్యక్షతన ఈ కార్యక్రమం జరుగుతుంది. పార్లమెంట్ ప్రారంభోత్సవాన్ని రెండు దశలుగా నిర్వహిస్తున్నారు. తెల్లవారుజామునే పాత పార్లమెంట్ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద పూజ కార్యక్రమాలు చేపడుతారు. ఉదయం 7.30 గంటలకు పూజ కార్యక్రమం ఉంటుంది. ప్రధాని మోడీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ సహా పలువురు సీనియర్ మంత్రులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. ఉదయం 9.30గంటలకు లోక్‌సభ స్పీకర్ కుర్చీ కుడి పక్కన రాజదండం ప్రతిష్ఠిస్తారు. పూజ తరువాత అందరూ లోక్‌సభ, రాజ్యసభ ఛాంబర్లను సందర్శిస్తారు. ఉదయం 9.30గంటలకు లోక్‌సభ స్పీకర్ కుర్చీ కుడి పక్కన రాజదండాన్ని ప్రతిష్ఠిస్తారు. ఈ కార్యక్రమానికి తమిళనాడు నుంచి వచ్చిన పూజారులతో పాటు సెంగోల్ రూపకర్తలు సైతం హాజరుకానున్నారు. తరువాత పూజ కార్యక్రమం ఉంటుంది.

**3గంటల వరకు ప్రత్యేక కార్యక్రమాలు**

తమిళనాడు లోని తిరువాదుతురై అధీనంతో సహా 20 ఆధీనాలకు చెందిన మఠాధిపతులు పార్లమెంట్ ప్రారంభోత్సవానికి విశిష్ట అతిథులుగా హాజరవుతున్నారు. తిరువాదుతురై అధీనం మఠాధిపతి ప్రధాని మోదీకి రాజదండాన్ని అప్పగిస్తారు. అనంతరం మఠాధిపతులతో భేటీ అవుతారు మోడీ. ఇక మధ్యాహ్నం జాతీయ గీతాలాపనతో రెండో దశ ప్రారంభ వేడుకలు మొదలుకానున్నాయి. లోక్‌సభ ఛాంబర్‌లో జరిగే ఈ కార్యక్రమానికి ప్రధాని మోడీ సహా అతిథులు హాజరుకానున్నారు. పార్లమెంట్ నిర్మాణం సమయంలోని అనేక ఘట్టాలతో రూపొందించిన వీడియోలను ప్రదర్శిస్తారు. చివరగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మాట్లాడతారు. మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది.



## మోడీ చేతికి రాజ దండం

ఢిల్లీ: బంగారు రాజదండం సెంగోల్ ను ప్రధాని మోదీ అందుకున్నారు. కొత్త పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవానికి ఒకరోజు ముందు ప్రధాని నరేంద్ర మోదీ మే 27వ తేదీ శనివారం

(మిగతా 2లో..)

# నాన్ బీజేపీ పార్టీలు ఒక్కటి కావాలి: కేజ్రీవాల్



హైదరాబాద్ : ఢిల్లీ పరిపాలనను అడ్డుకుంటూ కేంద్రం తెచ్చిన ఆర్డినెన్స్‌ను సీఎం అరవింద్ కేజ్రీవాల్ తప్పుపట్టారు. ఇది ఢిల్లీ సమస్య కాదు.. ఇది ప్రజల సమస్య అని పేర్కొన్నారు. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ఇవాళ హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. తెలంగాణ సీఎం కేసీఆర్‌తో భేటీ అయిన తర్వాత నిర్వహించిన ప్రెస్‌కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ.. ఢిల్లీకి సహకారం అందించిన తెలంగాణ సీఎంకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఢిల్లీ ప్రజల తరపున తాను ధన్యవాదలు చెబుతున్నట్లు పేర్కొన్నారు. 2015, ఫిబ్రవరిలో తాము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామన్నారు. మేలో మోదీ సర్కార్ ఓ నోటిఫికేషన్ తెచ్చి తమ ప్రభుత్వాన్ని కూల్చారన్నారు.

(మిగతా 2లో..)

## ఈ ఏడాది చివర్లో అసెంబ్లీ ఎన్నికలు..
### కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ ప్రారంభం



హైదరాబాద్ : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలను ఈ ఏడాది చివర్లో నిర్వహించేందుకు ఎన్నికల సంఘం కసరత్తు ప్రారంభించింది. ఈ నేపథ్యంలో కొత్త ఓటర్ల నమోదుకు ప్రక్రియ ప్రారంభించింది ఎన్నికల సంఘం. ఇందులో భాగంగా 2023 అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు కొత్తగా ఓటరు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హత కలిగిన వారు బూత్ లెవల్ అధికారుల వద్ద దరఖాస్తు పూర్తి చేయాలని సూచించారు. అదే విధంగా జూన్ 24 నుంచి జులై 24 తేదీ వరకు ఓటరు కార్డులపై ఫోటోల మార్పిడి, పోలింగ్ కేంద్రాల బౌండరీల నిర్ధారణ చేయనున్నారు. జులై 25 నుంచి 31వ తేదీ వరకు నమూనా ఓటరు జాబితా రూపొందించనున్నారు. ఆ తర్వాత ఆగస్టు 2వ తేదీన ఓటరు ముసాయిదా జాబితాను విడుదల చేయనుంది.

(మిగతా 2లో..)

## ఎంపీ అవినాష్ రెడ్డి ముందస్తు బెయిల్‌పై కొనసాగుతున్న సస్పెన్స్..



హైదరాబాద్: ఎంపీ అవినాష్‌రెడ్డి ముందస్తు బెయిల్ విచారణ తెలంగాణ హైకోర్టులో కొనసాగుతూనే ఉంది. నిన్న ఉదయం నుంచి సాయంత్రం వరకు సాగిన వాదనల్లో కేసు ఎటూ తేలలేదు. దాదాపు 6 గంటల పాటు అవినాష్ రెడ్డి న్యాయవాది తన వాదనలను వినిపించారు. ఈ కేసులో పలు అంశాలను ప్రస్తావించిన అవినాష్ లాయర్.. విచారణలో సీబీఐ ఏకపక్షంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.

(మిగతా 2లో..)

# టార్గెట్ వికాసభారత్ @2047..





ఢిల్లీ: ప్రధాని మోదీ అధ్యక్షతన ఢిల్లీ ప్రగతిమైదాన్‌లో నీతిఆయోగ్ సమావేశం జరుగుతోంది. వికాసభారత్ ఏ 2047 అన్న థీమ్‌తో ఈసారి నీతిఆయోగ్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. 2047 నాటికి భారత్ ను పూర్తిగా అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికారత, మౌలిక సదుపాయాల కల్పన వంటి పలు అంశాలపై ప్రధానంగా చర్చించారు. దీంతోపాటు జీ20 సర్వసభ్య సమావేశం, నిర్వహణ.. ఆర్థిక వృద్ధి, తదితర అంశాలపై ప్రధాని ప్రస్తావించారు. ముఖ్యంగా భారత అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. ఈ సమావేశంలో పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర పాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు, కేంద్ర మంత్రులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. కీలక విషయాలపై నిర్వహిస్తున్న నీతి ఆయోగ్ సమావేశానికి ఏడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరుకాకపోవడం చర్చనీయాంశంగా మారింది. తెలంగాణ సీఎం కేసీఆర్, బెంగాల్ సీఎం మమత, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, పంజాబ్ సీఎం భగవంత్ మాన్, బీహార్ సీఎం నితీష్‌కుమార్ ఈ సమావేశానికి రాలేదు. అయితే, నీతిఆయోగ్ సమావేశంలో గతంలో తాము ప్రస్తావించిన సమస్యలకు ఇప్పటికి పరిష్కారం లభించలేదన్నారు మమత. అందుకే ఈ సమావేశానికి హాజరుకావడం లేదని వివరణ ఇచ్చారు.



## వైద్య కళాశాల తరగతులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి": రాష్ట్ర ఆరోగ్య కార్యదర్శి రిజ్వి





ఆసిఫాబాద్ జిల్లా మే27 (ప్రజాపాలన, ప్రతినిధి) :2023 –24 విద్యా సంవత్సరానికి రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన వైద్య కళాశాలలలో తరగతులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఆరోగ్య కార్యదర్శి రిజ్వి అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, టి ఎస్ ఎం ఎస్ ఐ డి సి ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్ళు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, టి ఎస్ ఎం ఎస్ ఐ డి సి ఇంజనీర్లతో వైద్య కళాశాలల నిర్మాణం, వసతుల కల్పన అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆరోగ్య కార్యదర్శి రిజ్వి మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించేందుకు వైద్యులు,సిబ్బంది సంఖ్యను పెంచే విధంగా రాష్ట్రవ్యాప్తంగా వైద్య కళాశాలలు ప్రారంభించడం జరుగుతుందని, ఈ క్రమంలో చేపట్టిన కళాశాలల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేసే విధంగా అధికారులు కృషి చేయాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవనంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రామకృష్ణ, వైద్య కళాశాల ప్రిన్సిపల్ నాగార్జున చారి, టి ఎస్ ఎం ఎస్ ఐ డి సి ఇంజనీర్లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన వైద్య కళాశాల భవన నిర్మాణ పనులు 70 శాతం పూర్తయ్యాయని, రెండు విడతల వారీగా పనులు వేగవంతం చేసేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. వైద్య కళాశాల భవనంలో తలుపులు, కిటికీల ఏర్పాటు, రంగులు వేయుట పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కళాశాలలో వైద్య విద్యను అభ్యసించే విద్యార్థిని విద్యార్థుల కోసం వసతి కల్పించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జూన్ 15వ తేదీ లోగా పనులు పూర్తి చేసే విధంగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ రంజిత్‌రెడ్డిని కలిసిన బీఆర్ఎస్ నాయకులు

**గ్రామల సమస్యలను పరిష్కరించాలని వినతి**



చేవెళ్ల మే 27,(ప్రజాపాలన): గ్రామాల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. చేవెళ్ల నియోజకవర్గ బీఆర్ఎస్ మాజీ యూత్ అధ్యక్షుడు వనం లక్ష్మీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఎంపీ రంజిత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. దీనికి ఎంపీ రంజిత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని, దశల వారీగా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకుడు అలీ,బీఆర్ఎస్ నాయకులు భూపతిరెడ్డి తదితర నాయకులు ఉన్నారు.

## ఈ ఏడాది చివర్లో అసెంబ్లీ ఎన్నికలు..

(మొదటి పేజీ తరువాయి)

ఆగస్టు 31వ తేదీ వరకు ముసాయిదా జాబితాపై అభ్యంతరాలను స్వీకరించనుంది. ముసాయిదా జాబితాపై అందిన ఫిర్యాదులను సెప్టెంబర్ 22వ తేదీ వరకు పరిష్కరించనున్నారు. ఓటర్ల తుది జాబితా విడుదల కోసం సెప్టెంబర్ 29వ తేదీ వరకు ఎలక్షన్ కమిషన్ అనుమతి తీసుకుంటారు. కమిషన్ అనుమతి లభించగానే అక్టోబర్ 4వ తేదీన ఓటర్ల తుది జాబితా విడుదల కానుంది. www.nvsp.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు అవకాశం కల్పించారు.

# దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ..?

(మొదటి పేజీ తరువాయి)

అందులో నీతి ఆయోగ్ భేటీకి రాకపోవడం కూడా ఒకటి. కాగా, నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశానికి ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షత వహించారు.ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన ఢిల్లీలో జరిగిన నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ భేటీకి పలు రాష్ట్రాలకు చెందిన ముఖ్యమంత్రులు డుమ్మా కొట్టారు. వీరిలో తెలంగాణ సీఎం కేసీఆర్?, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్, కేరళ సీఎం పినరయి విజయన్, బిహార్ సీఎం నితీష్ కుమార్, పంజాబ్ సీఎం భగవంత్ మాన్, రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లాట్ ఉన్నారు.

**ప్రతిపక్షం ఎందుకు బహిష్కరిస్తోంది?**

ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వానికే కీలక అధికారాలు ఉండాలన్న సుప్రీంకోర్టు తీర్పును కాదని, కేంద్ర ప్రభుత్వం ఢిల్లీపై పెత్తనం చెలాయించేందుకు ప్రయత్నిస్తోంది. దీనికోసం బ్యూరోక్రాట్‌ల బదిలీ, పోస్టింగ్‌లపై కేంద్రం తీసుకొచ్చిన ఆర్డినెన్స్ కు వ్యతిరేకంగా మద్దతు సేకరించడానికి ప్రతిపక్ష నేతలను ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ కలుస్తున్నారు. కేంద్రం అనుసరిస్తున్న విధానాలకు నిరసనగా ఈ సమావేశాన్ని పలు రాష్ట్రాల సీఎంలు బహిష్కరించారు. అయితే.. బెంగాల్? సీఎం మమతా బెనర్జీ ఆ రాష్ట్రం నుంచి ఒక ప్రతినిధిని పంపడానికి ప్రతిపాదించారు. కాగా, ఆమె అభ్యర్థనను కేంద్రం తిరస్కరించింది, అంతేకాకుండా స్వయంగా మమతా బెనర్జీనే సమావేశానికి హాజరు కావాలని కేంద్రం చెప్పింది. ఇక.. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ భారతదేశంలో లేరు. అతను ప్రస్తుతం సింగపూర్, జపాన్ పర్యటనలో ఉన్నారు. దీంతో స్టాలిన్? ఈ సమావేశానికి హాజరు కాలేదు. కేరళ సీఎం పినరయి విజయన్ హాజరుకాకపోవడానికి గల కారణాలు అయితే ఇంకా తెలియరాలేదు. బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ కూడా ముందస్తు కట్టుబాట్లను పేర్కొంటూ సమావేశానికి మినహాయింపు ఇచ్చారు.అదేవిధంగా ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌తో తెలంగాణ సీఎం కేసీఆర్ ముందస్తుగా సమావేశమయ్యారు. ఢిల్లీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కేంద్రం ఆర్డినెన్స్ ను తీసుకురావడాన్ని వ్యతిరేకించడంలో నితీశ్‌కుమార్, కేసీఆర్ ఇద్దరూ కేజ్రీవాల్‌కు మద్దతు ఇస్తున్నారు. కాగా, అనారోగ్య కారణాలతో రాజస్థాన్ సీఎం సమావేశానికి దూరంగా ఉన్నట్టు పేర్కొన్నారు. మరోవైపు పంజాబ్ సీఎం భగవంత్ మాన్ నిధుల కేటాయింపు విషయంలో పంజాబ్ పట్ల కేంద్రం చూపుతున్న వివక్షతకు తన గైర్హాజరీకి కారణమని తెలిపారు. అయితే.. ఈ నీతి ఆయోగ్? భేటీలో వంద ముఖ్యమైన అంశాలపై చర్చ జరగనున్నట్టు తెలుస్తోంది. ఈ సమావేశాన్ని దాటవేసే పార్టీలు "రాష్ట్రాభివృద్ధిని బహిష్కరిస్తున్నట్లు కనిపిస్తున్నాయి" అని కేంద్ర ప్రభుత్వ వర్గాలను ఉటంకిస్తూ ఓ వార్త సంస్థ కథనం ప్రచురించింది. 2047 నాటికి దేశాన్ని అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా మార్చడం, , మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు, సమ్మతిని తగ్గించడం, మహిళా సాధికారత, ఆరోగ్యం, పోషకాహారం, నైపుణ్యాభివృద్ధి.. ప్రగతి వంటి అంశాలపై ఈ సమావేశంలో రోడ్‌మ్యాప్ వంటి నిర్దేశనం ఉంటుందని అధికార వర్గాలు తెలిపాయి. ముఖ్యమైన అభివృద్ధి సమస్యలను గుర్తించడంలో.. ఉమ్మడిగా పరిష్కారాలను కనుగొనడంలో ఈ సమావేశాలు కేంద్రం, రాష్ట్రాలు రెండింటికీ అవకాశం కల్పిస్తాయని అధికార వర్గాలు నొక్కిచెప్పాయి. కాగా, కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ కూడా ప్రతిపక్షాలను తీవ్రంగా విమర్శించారు. దేశ అభివృద్ధికి నీతి ఆయోగ్ చాలా కీలకం. వంద అంశాలు చర్చకు రావాలని ప్రతిపాదించినప్పటికీ, ఎనిమిది మంది ముఖ్యమంత్రులు సమావేశానికి రాలేదు. తద్వారా తమ రాష్ట్ర ప్రజల వాయిస్?ని వినిపించడంలో వారు విఫలమయ్యారు. వారికి అభివృద్ధి చేయాలన్న దృక్కోణం లేదా? మోదీకి వ్యతిరేకంగా మీరు ఏ మేరకు నిరసన తెలియజేలనుకుంటున్నారు? అని ప్రశ్నించారు.

# నాన్ బీజేపీ పార్టీలు ఒక్కటి కావాలి: కేజ్రీవాల్

(మొదటి పేజీ తరువాయి)

సర్వీస్ సంబంధిత విషయాల్లో గతంలో షీలా దీక్షిత్ వద్ద కంట్రోల్ ఉండేదన్నారు. తాము 8 ఏళ్లు పోరాటం చేశామని, మే 11వ తేదీన ఢిల్లీ ప్రజల తరపున అనుకూల తీర్పు వచ్చిందని, కానీ 8 రోజుల్లో వ్యతిరేక ఆర్డినెన్స్ తీసుకువచ్చిన ఢిల్లీ అధికారాల్ని మోదీ సర్కార్ లాగేసుకున్నట్లు కేజ్రీవాల్ తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాలను పక్కనపెట్టేసి ఆర్డినెన్స్ తేవడం అంటే న్యాయం కోసం ప్రజలు ఎక్కడికి వెళ్తారని ఆయన అడిగారు. ఢిల్లీ ప్రజలను ఇది అవమానించడమే అన్నారు. ఇది ఢిల్లీ ప్రజల సమస్య కాదు, ఇది దేశ ప్రజల సమస్య అన్నారు.సీబీఐ, ఈడీలతో బెదిరిస్తూ.. ప్రభుత్వాలను కూల్చివేస్తున్నారని బీజేపీపై కేజ్రీ ఆరోపణలు చేశారు. నాన్ బీజేపీ సర్కార్లను కూల్చివేయడం బీజేపీకి అలవాటు అయ్యిందన్నారు. దేశవ్యాప్తంగా తాను ప్రజల తరపున తిరుగుతున్నట్లు ఆయన చెప్పారు. ఒకవేళ గవర్నరే పాలన చేయాలనుకుంటే, అప్పుడు ముఖ్యమంత్రిని ఎన్నుకోవాల్సి అవసరం ఏముందని ఆయన ప్రశ్నించారు. నాన్ బీజేపీ పార్టీలు అన్ని ఒక్కటి అయితేనే బీజేపీ ఢీకొట్టగలమన్నారు. దేశ ప్రజల్లో విశ్వాసం నింపాలన్నారు. ఆజాదీని రక్షించుకోవాలంటే మోదీని ఓడించాలని కేజ్రీ పిలుపునిచ్చారు.దేశ ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకే తాము పోరాటం చేస్తున్నట్లు పంజాబ్ సీఎం భగవంత్‌మాన్ సింగ్ తెలిపారు. నీతి ఆయోగ్ మీటింగ్ ఇవాళ ఢిల్లీలో జరుగుతోందని, కానీ అక్కడ చేసేది ఏమీలేదని, అందుకే తాము ఆ మీటింగ్‌ను బహిష్కరించినట్లు ఆయన చెప్పారు. మీటింగ్‌లను తమకు నచ్చినట్లే నిర్వహిస్తున్నారని భగవంత్‌మాన్ విమర్శించారు.

## ఎంపీ అవినాష్ రెడ్డి ముందస్తు బెయిల్‌పై కొనసాగుతున్న సస్పెన్స్..

(మొదటి పేజీ తరువాయి)

వాచ్‌మెన్ రంగన్న స్టేట్‌మెంట్‌లో క్లియర్‌గా నలుగురు నిందితుల పేర్లు చెప్పినా ఆ వివరాలు ఎక్కడా లేవని అవినాష్ న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఇక దస్తగిరిని ఒక్క సారి కూడా విచారణకు పిలువలేదని.. అరెస్ట్ చేయలేదని వాదించారు. అవినాష్ గురించి దస్తగిరి ఎక్కడా చెప్పలేదని గుర్తు చేశారు. ఈ కేసులో సప్లిమెంటరీ ఛార్జ్ షీట్ దాఖలు చేసిన సంవత్సరం తరువాత జనవరి 23 న అవినాష్‌కు నోటీసులు ఇచ్చారని గుర్తు చేశారు. అవినాష్‌పై లేని పోని అబాండాలు మోపుతున్నారని కోర్టుకు తెలిపారు. ఈ నెల 19న సీబీఐ ముందుకు రావాల్సి ఉండగా.. తల్లి ఆరోగ్యం సీరియస్‌గా ఉండడంతో మార్గమధ్యలో నుంచి వెనక్కు వెళ్లాల్సి వచ్చిందని గుర్తు చేశారు. అప్పటి నుంచి కర్నూలు ఆస్పత్రిలోనే ఉన్నారని తెలిపారు. అందుకే 27 వరకు హాజరు కావడానికి సమయం అడిగామన్నారు. ఇక ఆధారాలు మాయం చేస్తారని వస్తున్న ఆరోపణలను కూడా ఖండించారు. ఆ తర్వాత వాదనల కోసం జోక్యం చేసుకున్న సునీతారెడ్డి లాయర్‌పై కోర్టు అసహనం వ్యక్తం చేసింది. అవినాష్ లాయర్‌కు ఇచ్చిన సమయం ఇవ్వాలనడంతో ఆగ్రహం వ్యక్తం చేసింది. విచారణ వేగంగా సాగే విధంగా చూడాలని కోరడంతో పాటు.. పలు విషయాలను ప్రస్తావించారు. సీబీఐ వాదనలను ఈరోజు వింటామంటూ కోర్టు వాయిదా వేసింది. అయితే బెయిల్ పిటిషన్ సమయంలో సీబీఐ దాఖలు చేసిన అఫిడవిట్‌పై ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణా రెడ్డి మండిపడ్డారు.

## మోడీ చేతికి రాజ దండం

(మొదటి పేజీ తరువాయి)

ఢిల్లీలోని తన నివాసంలో తమిళనాడు కు చెందిన 20 శైవ పీఠాల అధిపతులతో సమావేశమ య్యారు. ఈ సందర్భంగా మఠాధిపతుల్లో 293వ ప్రధాన పూజారి ప్రధాని మోదీకి సెంగోల్‌ను బహుకరించారు. తిరువావడుతురైకి చెందిన 20 శైవ మఠాధిపతులు చెన్నై నుంచి మే 27వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు దేశ రాజధాని ఢిల్లీకి చేరుకున్నారు. ప్రధాని మోదీని ఆయన నివాసంలో కలిసి ఘనంగా సత్కరించారు. అనంతరం మోదీకి సెంగోల్ ను బహూకరించారు. కొత్త పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ స్పీకర్ సీటు దగ్గర 'సెంగోల్' (రాజదండం) ఉంచుతారు. 14 ఆగస్టు, 1947న, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ మొదటిసారిగా ఈ సెంగోల్‌ను అందుకున్నారు. ఇది బ్రిటీష్ వారి చేతుల నుండి అధికార మార్పిడికి చిహ్నంగా అభివర్ణించారు. అప్పటి మద్రాసులో సుప్రసిద్ధ నగల వ్యాపారి అయిన వుమ్మిడి బంగారు చెట్టి ఈ సెంగోల్‌ను రూపొందించారు. అద్భుతమైన రాజదండం సుమారు ఐదు అడుగుల పొడవు, పైభాగంలో ఒక ఎద్దు చెక్కబడి ఉంటుంది.

## "జిల్లా నుండి ఐఏఎస్ కు ఎంపిక కావడం గర్వకారణం": జిల్లా కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎమ్మెల్యే



ఆసిఫాబాద్ జిల్లా మే 27 (ప్రజాపాలన, ప్రతినిధి) : ఆసిఫాబాద్ జిల్లా నుండి ఐఏఎస్ కు ఎంపిక కావడం జిల్లాకే గర్వకారణమని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, ఎమ్మెల్యే ఆత్రం సక్కు లు అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఛాంబర్ లో ఇటీవల విడుదలైన యూ,పీ,ఎస్,సి ఫలితాలలో సివిల్స్ లో 410 వ ర్యాంకు సాధించిన జిల్లాలోని రెబ్బెన మండలం తుంగెడ గ్రామానికి చెందిన డోంగ్రి రేవయ్యను అదనపు కలెక్టర్ రాజేశంతో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సివిల్స్ లో జిల్లా నుంచి ఎంపిక కావడం అభినందనీయమని, యువత రేవయ్యను స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత శిఖరాలలో నిలిచి జిల్లాకు, తల్లిదండ్రులకు, మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పేదరికాన్ని జయించి ఉన్నత లక్ష్యాన్ని సాధించిన దేవయ్య కృషి స్ఫూర్తి దాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాజేశ్వర్, ఎంపీపీ మల్లికార్జున్, హ్రవే సందీప్, తదితరులు పాల్గొన్నారు.

## సి ఏ ల్యాండ్ సర్వే నిర్వహించి నివేదిక సమర్పించాలి: జిల్లా కలెక్టర్ హేమంత్ బోర్కడే



ఆసిఫాబాద్ జిల్లా మే27 (ప్రజాపాలన, ప్రతినిది) : జిల్లాలోని తిర్యాణి మండలం పంగిడి మాదర లోని బుగ్గ కూడా గ్రామ శివారులో సి ఏ ల్యాండ్ కొరకు కేటాయించిన ప్రభుత్వ భూమికి సంబంధించిన సర్వే నిర్వహించి సంబంధిత నివేదికను అందించాలని జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. శనివారం జిల్లాలోని తిర్యాణి మండలం పంగిడి మాదర లోని బుగ్గ గూడా గ్రామ శివారులో సి ఏ ల్యాండ్ ను జిల్లా అదనపు కలెక్టర్ రాజేశం, జిల్లా అటవీ అధికారి, ఆర్ డి ఓ రాజేశ్వర్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సి ఏ ల్యాండ్ సంబంధిత సర్వేను అధికారులు పకడ్బందీగా నిర్వహించి నివేదిక అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ అనంతరాజు,ఎఫ్ఆర్ఓ లు శ్రీనివాస్, అప్పలకొండ, ల్యాండ్ సర్వే రికార్డ్ ఏ డి సోమేశ్వర్, రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి: జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



ఆసిఫాబాద్ జిల్లా మే 27 (ప్రజాపాలన, ప్రతినిది) : తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ ఆండ్ నాలెడ్జ్ (టాస్క్) ఆధ్వర్యంలో అందిస్తున్న శిక్షణను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్ పాయి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో చేపట్టిన బేసిక్ ఐటి అండ్ అడ్వాన్స్ ఎక్సెల్ శిక్షణలు టాస్క్ కేంద్రంలో సోమవారం నుండి ప్రారంభం కానుందని, వారం రోజుల పాటు కొనసాగే ఈ శిక్షణను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం టాస్క్ కేంద్రం మొబైల్ నంబర్ 7993859595 కు సంప్రదించవచ్చని తెలిపారు.

## రూ.75 లక్షల తో చేపట్టబోయే అభివృద్ధి పనులకు భూమి పూజ



మధిర: భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్పర్సన్ మొండితోకలత జయాకర్, కమిషనర్ రమాదేవి వైస్ చైర్పర్సన్ శీలం విద్యాలత వెంకటరెడ్డి, మధిర సొసైటీ చైర్మన్ బిక్కీ ప్రసాద్, వార్డ్ కౌన్సిలర్లు మల్లాది వాసు వైవిఅప్పారావు ది రావత్ మాధవి, టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు కార్యదర్శులు కనుమూరి వెంకటేశ్వరరావు, అరెగ శ్రీనివాసరావు, మండల కార్యదర్శి బొగ్గుల భాస్కర్ రెడ్డి నాయకులు రంగశెట్టి కోటేశ్వరరావు బోయపాటి వెంకటేశ్వరావు కరివే సుధాకర్ కొటారీ రాఘవరావు, బాణాల శంకరాచారి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు



ఎర్రుపాలెం మే 27 ప్రజా పాలన ప్రతినిధి: మండల పరిధిలోని జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం నందు శనివారాన్ని పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. పూజా కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం ఆలయం వారిచే ఏర్పాటు చేయబడిన తీర్థ, అన్నప్రసాదాలను భక్తులు స్వీకరించారు.

## దళితుని భూమి కబ్జా చేసిన వారిపై ఎస్ సి ఎస్ టి అట్రాసిటీ కేస్ నమోదు చేయాలి: బి ఎస్ పి పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి



మంచిర్యాల టౌన్, మే 27, ప్రజాపాలన: మంచిర్యాల జిల్లా నస్పూర్ మండలం నస్పూర్ శివార్ లోని సర్వే నెంబర్ 102 లో గజెల్లి శంకరయ్య అనే దళితుని 14 ఎకరాల భూమిని కే.వి ప్రతాప్ తోట కిష్టయ్య బొరిగం రాజారాం బొరిగం వెంకటేష్ కబ్జా చేశారాని బిఎస్పీ పార్టీ జోనల్ మహిళ కన్వీనర్ మద్దెల భవాని ఆరోపించారు. శనివారం బాధిత కుటుంబాలతో కలిసి బి ఎస్ పి పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తోట కిష్టయ్య కె.వి.ప్రతాప్ బొరిగం రాజారాం ల పై ఎస్ సి ఎస్ టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే జిల్లా కలెక్టర్ స్పదించి ఒక దళిత బిడ్డ శంకరయ్య కు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో బి ఎస్ పి పార్టీ బొడ్డు జిల్లా మహిళా కన్వీనర్ బొడ్డు వినోద కన్వీనర్ చెన్నూరు నియోజకవర్గ మహిళ కన్వీనర్ బత్తుల సరిత ఆసంపల్లి రామ మందమర్రి మండల కన్వీనర్ లక్ష్మి నాయకులు పోసక్క పద్మ దుర్గక్క రజిత నిర్మల శారద భాగ్య భాదితులు గజేల్లి శంకరయ్య బి ఎస్ పి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సమీకృత కలెక్టరేట్ భవన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి

**కలెక్టర్ బదావత్ సంతోష్**



మంచిర్యాల బ్యూరో, మే 27, ప్రజాపాలన :సమీకృత జిల్లా శాఖల కార్యాలయాల (కలెక్టరేట్) సము దాయం భవనం పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రారంభానికి సిద్దం చేయాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్ మండల కేంద్రంలో నిర్మితమవుతున్న సమీకృత కలెక్టరేట్ నిర్మాణ పనులను జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్, జిల్లా అదనపు కలెక్టర్లు డి. మధుసూదన్ నాయక్, బి.రాహుల్, డి.సి.పి. సుధీర్ రామ్నాథ్ కేకన్, మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు నడిపెల్లి దివాకర్రావుతో కలిసి పరిశీలించారు. కలెక్టరేట్ భవనంలో జిల్లా శాఖల కార్యాలయాలు, వివిధ సేవల నిమిత్తం కలెక్టరేట్కు వచ్చే ప్రజలు వేచి ఉండే ప్రాంతాలు, భవన ఆవరణ, సమావేశ మందిరం పనులను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ సేవలన్నీ ఒకే చోట అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం చేపట్టిన సమీకృత కలెక్టరేట్ భవనాల నిర్మాణాలలో భాగంగా జిల్లాలో చేపట్టిన కలెక్టరేట్ పనులను వేగవంతం చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని, అంతర్గత రహదారులు, గ్రీన్ కారిడార్, మురుగు కాలువల వ్యవస్థ, త్రాగునీరు, విద్యుత్ సరఫరా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. సమీకృత జిల్లా శాఖల కార్యాలయాల సముదాయం ద్వారా జిల్లా శాఖల కార్యాలయాలు ఒకే చోట ఉ ండటంతో ప్రజలకు ప్రభుత్వ సేవలు ఎలాంటి జాప్యం లేకుండా వేగంగా అందుతాయని, కార్యాలయాలకు తిరిగే అవస్థలు తొలగుతాయని తెలిపారు. సంబంధిత అధికారులు ప్రతి రోజు పనులను పర్యవేక్షిస్తూ త్వరగా పూర్తి చేసి ప్రారంభించేందుకు సిద్దం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల రాజస్వ మండల అధికారి దాసరి వేణు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి. శేషాద్రి శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర ఏర్పడి 9 సంవత్సరాలు పూర్తి చేసుకుని పదో వసంతంలోకి అడుగు



ఇబ్రహింపట్నం మే తేది 27 ప్రజాపాలన ప్రతినిధి :తెలంగాణ రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాలను జిల్లా వ్యాప్తంగా అంగరంగ వైభవోపేతంగా నిర్వహించేలా చక్కటి కార్యాచరణతో సన్నద్ధం కావలసినదిగా జిల్లా కలెక్టర్ హరీష్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడి వచ్చే జూన్ నాటికి తొమ్మిదేండ్లు పూర్తి చేసుకుని 10 వ వసంతంలోకి అడుగిడుతున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం 21 రోజుల పాటు పండుగ వాతావరణంలో రోజు ఒక కార్యక్రమం చొప్పున జూన్ 2 నుండి 22 వరకు వివిధ శాఖల ద్వారా పలు కార్యక్రమాలు చేపట్టుటకు షెడ్యూల్ ప్రకటించిందని అన్నారు. శనివారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు, ప్రతీక్ జైన్, తిరుపతి రావు, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియలతో కలిసి ఆయా శాఖలు చేపట్టవలసిన కార్యక్రమాలపై తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాలలో ఆయా శాఖలు 2 జూన్ 2014 నుండి నేటి వరకు చేపట్టిన కార్యక్రమాలు, సాధించిన ప్రగతి, లబ్ధిదారుల వివరాలు, చేసిన ఖర్చుతోపాటు గ్రామ, నియోజక వర్గ, మునిసిపాలిటీ స్థాయిలో ఎక్కడ కార్యక్రమాలు నిర్వహిస్తారో కార్యాచరణ నివేదిక అందజేయవలసినదిగా సూచించారు. నాడు-నేడు పేర అప్పటి పరిస్థితి - నేటి ప్రగతి ద్వారా మార్పు స్పష్టంగా తెలిపే ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని, అదేవిధంగా కరపత్రం, పుస్తకాలూ ముద్రించి తమ కార్యక్రమం రోజు పంపిణి చేయాలని అన్నారు. సమగ్ర సమాచారం తమ క్రింది స్థాయి అధికారులకు తెలిసేలా ఉ ండాలన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల విజయగాధలు, అభిప్రాయాలను నలుగురికి తెలపాలని అన్నారు. తమ కార్యక్రమాల రోజు ప్రజా ప్రతినిధులు, లబ్ధిదారులను ఆహ్వానించాలని, చక్కటి ఫ్లవర్ డెకరేషన్ తో పాటు లైటింగ్ ఏర్పాటు చేయాలని, నిర్దేశించిన రోజులలో సహా పంక్తి భోజనం ఏర్పాటు చేయాలని సూచించారు. నియోజక వర్గ ప్రత్యేక అధికారులు, జిల్లా అధికారులు సమన్వయంతో పని చేయాలని, సంబంధిత ఆర్.డి.ఓ.లు 21 రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాలను సమన్వయము చేసుకోవాలని ఆదేశించారు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా జూన్ 2న అవతరణోత్సవ వేడుకలు, 3న తెలంగాణ రైతు దినోత్సవం, 4న సురక్షా దినోత్సవం, 5న విద్యుత్ విజయోత్సవం, 6న పారిశ్రామిక ప్రగతి ఉత్సవం, 7న సాగునీటి దినోత్సవం, 8న ఊరూరా చెరువుల పండుగ, 9న సంక్షేమ సంబురాలు, 10న సుపరిపాలన దినోత్సవం, 11న సాహిత్య దినోత్సవం, 12న తెలంగాణా రన్, 13న మహిళా సంక్షేమం, 14న వైద్య ఆరోగ్యం,15న పల్లె ప్రగతి,16న పట్టణ ప్రగతి, 17న గిరిజనోత్సవం, 18న మంచినీలా పండుగ, 19న హరితోత్సవం, 20న విద్య, 21న ఆధ్యాత్మిక దినోత్సవం చివరగా జూన్ 22న అమరుల సంస్మరణ కార్యక్రమాలు ఉంటాయని కలెక్టర్ తెలిపారు. -ఈ సమావేశంలో జిల్లా అధికారులు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు, తదితర అధికారులు పాల్గొన్నారు.

## జూన్ 5 నుండి రెండో విడత గొర్రెల పంపిణీ ప్రారంభం: జడ్పిటిసి అరిగెల నాగేశ్వర్ రావు



ఆసిఫాబాద్ జిల్లా మే27 (ప్రజాపాలన, ప్రతినిది) : జూన్ 5వ తేదీ నుండి రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమం ప్రారంభం అవుతుందని జెడ్పిటిసి అరిగెల నాగేశ్వర్ రావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సురేష్ కుమార్ అధ్యక్షతనలో రెండో విడత గొర్రెల పంపిణీ అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 5వ తేదీ నుండి రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమం ప్రారంభమవుతుందని లబ్ధిదారులు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏ రాష్ట్ర ప్రభుత్వం చేయని రీతిలో తమ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. గొర్రెల పంపిణీ ద్వారా యాదవుల ఆర్థిక అభివృద్ధి జరుగుతుందన్నారు.జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సురేష్ కుమార్ మాట్లాడుతూ రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమంలో భాగంగా 1508 మందిని గుర్తించామని వీరిలో 485 మంది లబ్ధిదారులు తమ యొక్క వాటా మొత్తాన్ని రూ 43,700 జిల్లా కలెక్టర్ అకౌంట్లో జమచేయడం జరిగినదని, వీరి%ఎఱ% చంద్రాపూర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్ లోని కృష్ణాజిల్లా నుండి గొర్రెల కొనుగోలు ప్రారంభిస్తానని తెలిపారు. కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక టీములు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి మండలానికి ఒక జిల్లా అధికారిని ఇన్చార్జిగా నియమించడం జరిగిందని ఈ అధికారి ఆధ్వర్యంలో పంపిణీ నిర్వహిస్తున్నామన్నారు. ఎంపీపీ మల్లికార్జున్ మాట్లాడుతూ లబ్ధిదారులు తమ వాటా మొత్తాన్ని తొందరగా జమ చేయడంతో పాటు, వారి యొక్క కుల దృవీకరణ పత్రం, ఆధార్, బ్యాంకు పాస్ బుక్, నామిని ధ్రువీకరణ పత్రాలను, మరణించిన లబ్ధిదారులు డిపెండెంట్, డెత్ సర్టిఫికెట్స్, నామిని యొక్క దృవీకరణ పత్రాలను ఆయా మండలాల పశు వైద్యాధికారికి సమర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య అధికారి డాక్టర్ మురళికృష్ణ, సర్పంచులు భీమేష్,మహేష్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఫీజుల నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి




మంచిర్యాల టౌన్, మే 27, ప్రజాపాలన: ఫీజుల నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దాగం శ్రీకాంత్ ఆధ్వర్యంలో శనివారం రోజున పట్టణం లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజినీకాంత్ మాట్లాడుతూ విద్యా సంస్థల లో ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని ప్రైవేట్ కార్పొరేట్ ఇష్టానుసారంగా ఫీజుల దోపిడీ చేస్తూ విద్యార్థులకు చదువుని అమ్ముకుంటూ వారికి చదువుదూరం అయ్యేలా కార్పొరేట్ శక్తులు వ్యవహరిస్తున్నాయి అని అన్నారు. ఈ ఫీజులను నియంత్రించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ప్రభుత్వ అధికార యంత్రాంగం పట్టించుకోకుండా కార్పొరేట్ వ్యక్తులకు కొమ్ము కాస్తూ విద్యను నీరుగారుస్తున్న పరిస్థితి జిల్లాలో నెలకొందని ఇకనైనా ప్రభుత్వాధికారులు స్పందించి ఫీజులు నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని లేని యెడల జిల్లాలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మిట్టపల్లి తిరుపతి జిల్లా సహాయ కార్యదర్శి అనిల్ నస్పూర్ మండల కార్యదర్శి ఈదునూరి అభినవ్ మండలం నాయకులు రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## బాల్యవివాహాలపై అవగాహన సదస్సు



ఇబ్రహింపట్నం మే తేది 27 ప్రజాపాలన ప్రతినిధి: మంచాల్ మండలం లోని దాద్ పల్లి గ్రామంలో జిల్లా సంక్షేమ అధికారి పద్మజారమణ ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల జడ్పిటిసి మర్రి నిత్య నిరంజన్ రెడ్డి హాజరైనారు. ఈ సందర్భంగా జడ్పిటిసి మర్రి నిత్య నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ..బాల్య వివాహాల నిషేధ చట్టం 2006 ప్రకారం 18 సంవత్సరాల లోపు ఉన్న ఆడపిల్లలకు, 21 సంవత్సరాలలోపు మగపిల్లలకు పెళ్లి చేయడం నేరమని తెలిపారు. ఈ పెళ్లిలో పాల్గొన్న వారికి, పెళ్లికి సహకరించిన వారందరికీ 2 సంవత్సరాలు జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా ఉంటుందని హెచ్చరించారు.కాబట్టి ప్రతి ఒక్కరూ బాల్యవివాహాల నిషేధంలో భాగస్వామ్యులు అవ్వాలి అని కోరారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేయకూడదు ఒకవేళ చేసిన సహకరించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు.అలాగే చిన్న వయసులో పెళ్లి చేసుకోవడం వలన వారి ఆరోగ్యం పై ప్రభావం చూపుతుంది అలాగే చిన్నతనంలో గర్భం దాల్చడం వలన పిల్లలు అంగవైకల్యంతో పుట్టవచ్చు లేదా తక్కువ బరువుతో పుట్టవచ్చు చనిపోయే ప్రమాదం కూడా ఉంటుంది గర్భస్రావం అయ్యే ప్రమాదం కూడా ఉన్నది కనుక చిన్నతనంలో పెళ్లి చేయకూడదు.కాబట్టి ఆడపిల్లల్ని బాగా చదివించి ఉన్న స్థాయిలో నెలదొక్కుకునేలా వారికి అవకాశం కల్పించాలని కోరారు. బాల్యవాలు జరిపిస్తే కఠిన చర్యలు ఒకవేళ బాల్య వివాహం జరుగునున్నట్లు తెలిస్తే చిల్డ్ హెల్ప్ లైన్ 1098 కి తప్పకుండా సమాచారం ఇవ్వగలరు. ఈ అవగాహన సదస్సులో గ్రామ సర్పంచ్ దోర్జి, మహిళ శక్తి కేంద్రం కోఆర్డినేటర్ విజయభాస్కర్,బి ఆర్ బి కోఆర్డినేటర్ హర్షవర్ధిని, ఐసిడిఎస్ సూపర్వైజర్, అంగన్వాడీ టీచర్స్ గ్రామస్తులు పాల్గొన్నారు.



జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన


**సంపాదకీయం**

ఆదివారం 28, మే 2023

# కార్మికవర్గంపై అప్పుల అనకొండ దాడి !

ప్రతి సంక్షోభమూ ప్రతి చోటా గతంలో కార్మికవర్గ సంపాదించుకున్న హక్కులు, సామాజిక రక్షణలనూ హరిస్తున్నది. తప్పనిసరై కరోనా కాలంలో ఇచ్చిన మెడికల్ బీమా రాయితీలను సమీక్షించాలని రాష్ట్రాలను బైడెన్ ఆదేశించాడు. వాటిని గనుక రద్దు చేస్తే 53 నుంచి 142 లక్షల మంది వరకు వీధిన పడతారు. అందువలన ఇది ఒక్క అమెరికా సమస్యే కాదు. పెద్దన్న అడుగు జాడల్లో నడిచే ప్రతి చోటా అప్పుల అనకొండలు కార్మికవర్గం మీద దాడులకు దిగుతాయి. జూన్ ఒకటవ తేదీ దగ్గర పడే కొద్దీ...తమ మీద ఎక్కడ పిడుగు పడుతుందో, ఎలా పడుతుందోనని ... అమెరికా కార్మికవర్గం, మధ్య తరగతిలో గుబులు పెరుగుతోంది. ఉరుము ఉరిమి ఓటి మంగలం మీద పడినట్లు దేశ రుణ పరిమితి గురించి అధికార డెమోక్రటిక్, ప్రతిపక్ష రిపబ్లికన్ల మధ్య వాద ప్రతివాదనల లాలూచీ తతంగం తమ మీద భారం ఎంత మోపుతుందనేదే వారి ఆందోళన. ప్రభుత్వ రుణ పరిమితి పెంపుదలపై ప్రజా ప్రతినిధుల సభలో మెజారిటీగా ఉన్న రిపబ్లికన్లు అంగీకరించకపోతే జనం మీద భారం పడుతుంది. వచ్చే ఏడాది జరిగే ఎన్నికలలో అంతా మీరే చేశారు, దీనంతటికీ మీరే కారణం అని డెమోక్రాట్ల మీద రాజకీయ దాడి చేసేందుకు ప్రతిపక్ష రిపబ్లికన్ పార్టీ పెంపుదలకు నిరాకరిస్తుందా లేక చివరి వరకు మొరాయించి ఓట్ల కోసం అంగీకరిస్తుందా అన్నది చూడాల్సి ఉంది. రుణ పరిమితి ఎంత పెరిగితే అంతగా జనం మీద భారాలు పెరగటం లేదా ఉన్న సౌకర్యాలకు కోత పడుతుంది. ప్రపంచంలో అనేక దేశాలు రుణ ఊబిలో కూరుకు పోతున్నాయి. గత పాతిక సంవత్సరాల్లో ప్రత్యేకించి గడచిన పదేళ్లలో, కరోనాతో, కొనసాగుతున్న ఉక్రెయిన్ సంక్షోభంతో ఆదాయం తక్కువగా ఉండే దేశాల రుణాలు పెరిగాయి. డెబ్బయి మూడు దేశాలు అధిక రుణ భారంతో ఉండగా వాటికి ఉపశమనం కలిగించేందుకు జి-20 కూటమి చొరవ తీసుకొన్నది. వడ్డీ, అసలు చెల్లింపులను వాయిదా వేయించేందుకు అప్పులిచ్చిన వారితో చర్చలకు 2020-21 లోనే తెరతీసింది. నలభై ఒక్క దేశాలు ఇవాళా రేపా అన్నట్లుగా తీవ్ర పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. మన ఇరుగు పొరుగున ఉన్న శ్రీలంక, పాకిస్తాన్ పరిస్థితి తెలిసిందే. ఐఎంఎఫ్ గుమ్మం తొక్కితే అప్పు తీర్చే శక్తిని సమకూర్చుకొనే పేరుతో అది విధిస్తున్న షరతులతో జనం మీద మరిన్ని భారాలు మోపాల్సి ఉంటుంది. అమెరికాలోనూ జరిగేది అదే. పేద దేశాలు ఎదుర్కొంటున్న పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ప్రపంచంలో ఏకైక ధనిక దేశమైన అమెరికాకు సత్తా ఉండి కూడా ఎందుకు రుణాలు చేస్తున్నది అనే ప్రశ్న తలెత్తటం సహజం. కార్పొరేట్లకు దేశ సంపదలను కట్టబెట్టటంతో పాటు ప్రపంచం మీద ఎదురులేని పెత్తనం కోసం మిలిటరీ బడ్జెట్‌ను విపరీతంగా పెంచటం, మార్కెట్లు, వనరులను ఆక్రమించుకొనేందుకు చేస్తున్న దురాక్రమణలు, యుద్ధాలకు వెచ్చిస్తున్న ఖర్చు వంటి ప్రజా వ్యతిరేక పనులే ప్రధాన కారణం అని గమనించాలి. ప్రపంచ రుణ భారం 2023 తొలి మూడు నెలల్లో పెరిగిన 8.3 లక్షల కోట్ల డాలర్లతో మొత్తం 305 లక్షల కోట్ల డాలర్లకు చేరింది. దీనిలో అమెరికా ప్రభుత్వ అప్పు 31.4 లక్షల కోట్ల డాలర్లు. ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్లలో గత రెండు దశాబ్దాల్లో అది నాలుగు నుంచి ఆరు లక్షల కోట్ల డాలర్లు ఖర్చు చేసింది. కీలుబొమ్మ ఉక్రెయిన్‌కు 375 బిలియన్ డాలర్ల మేర సాయం అందించనున్నట్లు హిరోషిమా జి7 సమావేశాలలో జోబైడెన్ ప్రకటించాడు. ఇది గత సంవత్సరం ఇచ్చిన 113 బి.డాలర్లకు అదనం. కార్పొరేట్లకు జార్జి డబ్ల్యు బుష్ రెండు సార్లు తాత్కాలికంగా పన్నులు తగ్గించాడు. తరువాత అధికారానికి వచ్చిన ఒబామా వాటిని శాశ్వతం చేయటంతో పదేళ్లలో నాలుగు లక్షల కోట్ల డాలర్ల మేర ఖజానాకు గండిపడి ఆ మేరకు రుణం పెరిగింది. ఇదిగాక డోనాల్డ్ ట్రంప్ పన్ను రేటును అధికారికంగా తగ్గించి రెండు లక్షల కోట్ల డాలర్లను కట్టబెట్టాడు. ట్రంప్ బూట్లలో కాళ్లు దూర్చిన జో బైడెన్ అదే నడక సాగిస్తున్నాడు. దీంతో ఇంతింతై వటుడింతై అన్నట్లు అనకొండలా అప్పు పెరుగుతోంది. గత సంవత్సరం 55 కార్పొరేషన్లు అసలు పన్ను చెల్లించలేదని, అధికారికంగా 21 శాతం పన్ను చెల్లించాల్సి ఉన్నప్పటికీ సగటున చెల్లిస్తున్నది ఎనిమిది శాతానికి మించి లేదని హిరోషిమాలో బైడెన్ గర్వంగా చెప్పుకున్నాడు. ఇలాంటి మినహాయింపులు ఇవ్వటానికి కార్పొరేట్లు దివాలా తీశాయా అంటే అదేమీ లేదు. 2014-2020 కాలంలో ఏటా 20 శాతం చొప్పున లాభాలు పెంచుకోగా వాటి నుంచి ఖజానాకు రావాల్సిన మొత్తాలు 60 శాతం తగ్గాయి. ఓఇసిడి దేశాల జిడిపిలో కార్పొరేట్ పన్ను భాగం సగటున మూడు శాతం కాగా అదే అమెరికాలో 1.1 శాతమే ఉంది. దాని తరువాత చివరన ఒక శాతంతో లాత్వియా ఉంది. ఇక పెట్టుబడిదారీ వ్యవస్థలో ప్రతి పదేళ్లకు ఒకసారి వస్తున్న సంక్షోభాలలో దివాలా తీస్తున్న కార్పొరేట్ కంపెనీలను అదుకొనేందుకూ అప్పులే మార్గం. అది వారికి వరం జనానికి శాపం. 2008లో ఒబామా రెండు లక్షల కోట్ల డాలర్లను కార్పొరేట్లకు సమర్పించుకున్నాడు. ప్రతి సంక్షోభమూ ప్రతి చోటా గతంలో కార్మికవర్గ సంపాదించుకున్న హక్కులు, సామాజిక రక్షణలనూ హరిస్తున్నది. తప్పనిసరై కరోనా కాలంలో ఇచ్చిన మెడికల్ బీమా రాయితీలను సమీక్షించాలని రాష్ట్రాలను బైడెన్ ఆదేశించాడు. వాటిని గనుక రద్దు చేస్తే 53 నుంచి 142 లక్షల మంది వరకు వీధిన పడతారు. అందువలన ఇది ఒక్క అమెరికా సమస్యే కాదు. పెద్దన్న అడుగు జాడల్లో నడిచే ప్రతి చోటా అప్పుల అనకొండలు కార్మికవర్గం మీద దాడులకు దిగుతాయి.

# రాష్ట్ర జిడిపిలో ప్రజా జీవితాలకు చోటేది ?




రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి పెరుగుదల రాష్ట్ర ప్రజల అభివృద్ధికి ఏమాత్రం దోహదం చేయడంలేదనేది స్పష్టమౌతున్నది. వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలు ఆర్థిక వ్యవస్థలో, ప్రజల జీవితాల్లో తీవ్ర సమస్యలు సృష్టిస్తున్నాయి. ప్రభుత్వం చెబుతున్నట్లు పేదరికం, నిరుద్యోగం తగ్గక పోగా ఆదాయ అసమానతలు, జిల్లాల మధ్య అంతరాలు ఎక్కువవుతున్నాయి. వ్యవసాయ రంగం మీద ఆధారపడ్డ అత్యధిక మంది ప్రజల జీవితాలు మెరుగు పడకపోగా ఆహార పంటల నుండి భూమి వ్యవసాయేతర కార్యకలాపాలకు, పెద్ద పెట్టుబడులతో సాగయ్యే కార్యకలాపాలకు మార్పిడి జరుగుతున్నది. ఫలితంగా గ్రామీణ ప్రాంతంలో ఉపాధి సమస్య జఠిలం అవుతున్నది. వ్యాపార, వాణిజ్య, విద్య, వైద్య కార్యకలాపాలు పెద్ద పెద్ద పెట్టుబడులకు కేంద్రమౌతున్నాయి. సంపద కేంద్రీకృతమౌతున్నది. రాష్ట్రంలో పెరుగుతున్న రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి (ఎస్‌జిడిపి)పై గత కొంత కాలంగా చర్చ నడుస్తున్నది. తమ ప్రభుత్వ విధానాల వల్లే జిడిపి వేగంగా పెరుగుతున్నదని రాష్ట్ర ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటున్నది. అంతేకాక పెరుగుతున్న జిడిపి వల్ల రాష్ట్రంలో అభివృద్ధితో పాటు ప్రజా జీవనం అన్ని విధాలుగా మెరుగు పడుతున్నదని, పేదరికం, నిరుద్యోగం బాగా తగ్గిపోతున్నదని, ప్రాంతాల మధ్య అసమానతలు కూడా తగ్గుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వం వాదిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన సామాజిక, ఆర్థిక సర్వే 2022-23 ప్రకారం రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి రూ. 13.17 లక్షల కోట్లకు చేరింది. రాష్ట్ర సగటు తలసరి ఆదాయం రూ. 2.19 లక్షలుగా నమోదయ్యింది. ఇది దేశ సగటు తలసరి ఆదాయం కంటే ఎక్కువగా కూడా ఉంది. దేశ జిడిపిలో రాష్ట్రం 8వ స్థానంలోను, దేశ సగటు తలసరి ఆదాయంలో 16వ స్థానంలో ఉంది. రాష్ట్ర జిడిపిలో వ్యవసాయ రంగం వాటా 36.19 శాతం, పారిశ్రామిక రంగం వాటా 23.36 శాతం, సేవారంగం వాటా 40.45 శాతం ఉంది. ఈ మూడు రంగాల నుండి ఒక ఏడాదిలో వచ్చే ఆదాయాన్నే రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి అంటాం. ఈ అంకెలు, ప్రభుత్వ ప్రచారాన్ని బట్టి చూస్తే ఎవరైనా బోల్తా పడతారు. రాష్ట్రం బాగా అభివృద్ధి అవుతుందనే భ్రమల్లో పడతారు. కానీ రాష్ట్ర జిడిపిని లోతుగా పరిశీలిస్తే అభివృద్ధి ఎవరికి జరుగుతుందో? రాష్ట్రంలో సృష్టి అవుతున్న సంపద ఎవరి వరం అవుతున్నదో? రాష్ట్రంలో వ్యవసాయ, పారిశ్రామిక, సేవారంగాల్లో జరుగుతున్న ఆందోళనకర పరిణామాలు అర్థమౌతాయి. ఎస్‌జిడిపి అంకెల బండారం బయట పడుతుంది. వ్యవసాయ రంగాన్నే చూద్దాం. వ్యవసాయ రంగం బాగా అభివృద్ధి అవుతున్నదని వ్యవసాయం మీద ఆధారపడ్డ వారి ఆదాయాలు బాగా మెరుగు పడుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తున్నది. దీనికి రెండు ప్రధాన కారణాలను ప్రభుత్వం చూపుతున్నది. దేశ జిడిపిలో వ్యవసాయ రంగం వాటా బాగా పడిపోతున్నదని. ఆంధ్ర రాష్ట్రంలో మాత్రం వ్యవసాయ రంగం వాటా పెరుగుతున్నదని, వ్యవసాయ రంగం వృద్ధిరేటు కూడా దేశానికి భిన్నంగా రాష్ట్రంలో ఎక్కువగా నమోదవుతున్నదని చూపుతున్నది. అంకెలు, ప్రభుత్వ ప్రకటనలు చూస్తే వాస్తవమేననే భావన కలుతుంది. కానీ లోతుల్లోకి వెళ్ళి విశ్లేషణ చేస్తే వ్యవసాయ రంగం సంక్షోభంలోకి కూరుకుపోవడంతో పాటు వ్యవసాయ రంగంలో పెట్టుబడి కేంద్రీకరణ వేగంగా పెరుగుతున్నట్లు మనకి అర్థమౌతుంది. రాష్ట్ర జిడిపికి వ్యవసాయ రంగం నుండి 2022-23లో రూ. 4.39 లక్షల కోట్లు సమకూరింది. అదే ఏడాది వ్యవసాయ రంగ వృద్ధిరేటు 13.18గా నమోదయ్యింది. వ్యవసాయ రంగంలో ఆహార పంటలు, ఉద్యాన పంటలు, పశు, చేపలు, రొయ్యలు, అటవీ సంబంధిత విభాగాలు ఉంటాయి. దీనినే ప్రాథమిక రంగం అని కూడా అంటారు.

వ్యవసాయం మీద ఇప్పటికీ రాష్ట్రంలో 62.17 శాతం మంది ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వీరిలో 25 శాతం మంది ఆహార పంటల మీదే జీవనం సాగిస్తుంటారు. వ్యవసాయ రంగంలో మిగిలిన వాటి మీద ఆధారపడే వారు చాలా తక్కువ మంది మాత్రమే. వ్యవసాయ రంగంలో గత ఏడాదిలో వచ్చిన సంపదను పరిశీలిస్తే అత్యధిక మంది ప్రజలు ఆధారపడ్డ ఆహార పంటల నుండి కేవలం 12.13 శాతం మాత్రమే సృష్టించబడింది. మిగిలిన ఉద్యానవనాలు 28.09 శాతం, పశు సంబంధిత ఆదాయం 32.06 శాతం, చేపలు, రొయ్యలు 25.29 శాతం, అటవీ సంపద నుండి 2.21 శాతం సమకూర్చబడింది. సుమారు 60 శాతం ఆదాయం వ్యవసాయ రంగంలో చేపలు, రొయ్యలు, పౌల్ట్రీ, ప్లాంటేషన్‌ల నుండి వస్తున్నదనేది స్పష్టమౌతున్నది. ఇంకా ఆశ్చర్యం కలిగించే అంశమేమంటే రొయ్యలు, చేపల చెరువుల నుండి రూ. 1.11 లక్షల కోట్లు ఆదాయం వస్తే, ఆహార పంటల నుండి కేవలం రూ. 54, 161 కోట్లు మాత్రమే వచ్చింది. అదే 2011-12లో చూస్తే ఆహార పంటల నుండి రూ. 29.282 కోట్లు వస్తే చేపలు, రొయ్యల నుండి రూ. 11,877 కోట్లు మాత్రమే ఆదాయం వచ్చింది. గడిచిన పదేళ్ళలో వ్యవసాయంలో ఆహార ధాన్యాల పంటల కన్నా చేపలు, రొయ్యల సాగు ఆదాయం రెండు రెట్లు పెరిగింది. ఆహార ధాన్యాలు పండించే రైతులు సుమారు 50.92 లక్షల మంది (కౌలు రైతులు మినహా) ఉండగా చేపల, రొయ్యల సాగు చేసే రైతులు కేవలం 61,682 మంది మాత్రమే ఉన్నారు. అలాగే గత దశాబ్దం నుండి రాష్ట్రంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి 155 లక్షల టన్నుల చుట్టే తిరుగుతున్నది. తలసరి ఆహార ధాన్యాల వినియోగం బాగా తగ్గింది. ఆహార ధాన్యాలు పండించే భూమి ఈ కాలంలో 44 లక్షల హెక్టార్ల నుండి 39.59 లక్షల హెక్టార్లకు తగ్గిపోయింది. మొత్తంగా చూస్తే వ్యవసాయ రంగంలో 85 శాతం ప్రజల ఆదాయాలు నామమాత్రంగా ఉన్నాయనేది స్పష్టమౌతున్నది. ప్రభుత్వం చేస్తున్న ప్రచారంలో వాస్తవం కనిపించటం లేదు. వ్యవసాయ రంగం నుండి వచ్చే ఆదాయంలో అత్యధిక భాగం కొద్ది మందికి మాత్రమే వెళుతున్నది. ఈ పరిణామం వ్యవసాయ రంగంలో సంపద, భూ కేంద్రీకరణ, రైతులు, భూములు కోల్పోవటం వంటి చర్యలకు దారి తీస్తున్నది. ఫలితంగా అత్యధిక రైతాంగం సంక్షోభంలోనే కొనసాగుతున్నారు. ఈ వాస్తవ పరిస్థితిని ఎస్‌జిడిపి అంకెలు మరుగున పరుస్తున్నాయి. ఈ దుస్థితిలో గ్రామీణ ప్రజలు ఎక్కువభాగం కుటుంబ పోషణ కోసం పాడి పరిశ్రమను ముఖ్యమైన వృత్తిగా మార్చుకున్నారు. ఫలితంగా మన రాష్ట్రం పాల ఉత్పత్తిలో దేశంలో 5వ స్థానంలో నిలిచింది. ఇక పారిశ్రామిక రంగం చూస్తే రాష్ట్ర జిడిపిలో దీని వాటా క్రమంగా తగ్గిపోతున్నది. రాష్ట్ర విభజన అనంతరం 2013-14లో రాష్ట్ర జిడిపిలో పరిశ్రమల వాటా 25.17 శాతం ఉంటే 2022-23కి 23.36కి పడిపోయింది. 2.83 లక్షల కోట్ల సంపద సృష్టి అయ్యింది. వస్తు తయారీ రంగం చూస్తే ఎదుగుబొదుగు లేకుండా జిడిపిలో 10 శాతం చుట్టే తిరుగుతున్నది. పారిశ్రామిక నిర్మాణ రంగం వాటా కూడా గత తొమ్మిదేళ్ళల్లో జిడిపిలో 9.53 శాతం నుండి 6.91 శాతానికి క్షీణించింది. పారిశ్రామిక రంగం మీద ఆధారపడ్డ జనాభా చూస్తే కేవలం 18 శాతానికి మించి లేరు. ప్రస్తుత ప్రభుత్వంతో పాటు గత తెలుగుదేశం ప్రభుత్వం కూడా రాష్ట్ర పారిశ్రామికీకరణ గురించి తెగ గొప్పలు చెప్పారు. ఐటీ హబ్‌లు, పారిశ్రామిక క్లస్టర్లు, గ్రోత్ సెంటర్లు, కారిడార్లు...ఎక్కువ భాగం నత్తనడకనే సాగుతున్నాయి. ఇక అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సుల పేర రూ.లక్షల కోట్ల పెట్టుబడులు, ఉద్యోగాలు వస్తున్నాయని ప్రకటనలు చేస్తున్నారు. కాని వాస్తవ పరిస్థితి తలకిందులుగా ఉంది. సహకార రంగంలోని చెక్కర, డెయిరీ వంటి పరిశ్రమలతోపాటు జూట్ మిల్లులు అనేకం మూతబడ్డాయి. ప్రభుత్వ పెట్టుబడులున్న పరిశ్రమలను, సహజ వనరులను కూడా ప్రైవేటు సంస్థలకు ధారాదత్తం చేస్తూ భారీగా రాయితీలు ఇస్తున్నారు. పారిశ్రామిక రంగంలో ప్రభుత్వ పెట్టుబడుల కల్పన స్తంభించిపోయింది. మూడోది సేవారంగం. ఈ రంగం వాటా కూడా రాష్ట్ర జిడిపిలో 2013-14 లో 44.61 శాతం ఉంటే 2022-23కి 40.45 శాతానికి క్రమేణా తగ్గుతూ వచ్చింది. మరో ముఖ్య మైన పరిణామం ఏమంటే సేవా రంగంలో మూడో వంతు ఆదాయం రియల్ ఎస్టేట్, బ్యాంకింగ్ రంగాల నుండి రావడం. 2022-23లో సేవారంగం నుండి రూ. 4.91 లక్షల కోట్ల సంపద సృష్టి అయ్యింది. ఇందులో రియల్ ఎస్టేట్, బ్యాంకింగ్ కార్యకలాపాల నుండి రూ. 1.54 లక్షల కోట్లు వచ్చింది. ఈ రంగంలో అతి తక్కువ ఉపాధి అవకాశాలు మాత్రమే కల్పించబడతాయి. ఉపాధి అవకాశాలు తక్కువగా కల్పించబడే కార్యకలాపాల నుండి సేవా రంగానికి ఎక్కువ ఆదాయం వస్తున్నట్లు స్పష్టమౌతున్నది. ఫలితంగా రాష్ట్ర జిడిపిలో 40.45 శాతం వాటా కలిగిన సేవారంగం మీద కేవలం 20 శాతం మంది మాత్రమే ఉపాధి పొందుతున్నారు. ఈ రంగంలో సృష్టించబడుతున్న ఆదాయంలో అతి తక్కువ మాత్రమే వేతనాల రూపంలో ఈ రంగంలోని ప్రజలకు దక్కుతున్నాయి. ఈ రంగంలో సంపద కేంద్రీకరణ తీవ్రంగా ఉన్నట్లు రూఢ అవుతున్నది. రాష్ట్ర సగటు తలసరి ఆదాయం పెరుగుదలను కూడా అభివృద్ధిగా చూపించటం మరోటి. దేశ సగటు తలసరి ఆదాయం కంటే గత దశాబ్దం నుండి రాష్ట్ర తలసరి ఆదాయం ఎక్కువగా కొనసాగటం వల్ల పేదరికం కూడా బాగా తగ్గిందనే ప్రచారం కూడా చేస్తున్నారు. కేంద్ర బిజెపి సర్కార్ సైతం తన విధానాల వల్లనే ప్రపంచంలో భారతదేశం 5వ ఆర్థిక వ్యవస్థగా రూపొందిందని గొప్పలు చెప్పుకుంటున్నది. కాని పోగుపడుతున్న జిడిపి లేదా సంపద ప్రజలకు కింది దాకా పున:పంపిణీ కావటం లేదు. పైన వ్యవసాయ రంగంలో పేర్కొన్నట్లు కొద్ది మంది చేతుల్లో కేంద్రీకరణ జరుగుతున్నది. నయా ఉదారవాద విధానాలు ప్రారంభం నుండి బూర్జువా ఆర్థికవేత్తలు, పాలకులు చెప్పుకుంటూ వస్తున్న ట్రికిల్ డౌన్ సిద్ధాంతం ఆచరణలో పెద్ద డొల్లతనంగా మారింది. ఇక రాష్ట్ర సగటు తలసరి ఆదాయం ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన చూస్తే 13లో 9 జిల్లాలు రాష్ట్ర తలసరి సగటు కంటే దిగువ స్థాయిలో ఉన్నాయి. కేవలం విశాఖపట్నం, కృష్ణా, పశ్చిమ గోదావరి, నెల్లూరు జిల్లాలు మాత్రమే రాష్ట్ర సగటు తలసరి ఆదాయం కంటే ఎక్కువ ఆదాయం కలిగి ఉన్నాయి. కొత్త జిల్లాల ఆధారంగా జిల్లాల తలసరి ఆదాయాలు ప్రభుత్వం విడుదల చేస్తే జిల్లాల మధ్య ఆర్థిక అసమానతలు, వెనుకబాటు ఎంత తీవ్ర స్థాయిలో ఉన్నాయో మనకు అర్థమౌతుంది. పారిశ్రామిక రంగానికి విశాఖపట్నం, భోగాపురం, శ్రీ సిటీ వంటి కేంద్రాలు మాత్రమే ప్రధానమైనవిగా ఉన్నాయి. చేపలు, రొయ్యలు, చెరువులు, పౌల్ట్రీ, ప్లాంటేషన్‌లకు కృష్ణా, పశ్చిమ గోదావరి, నెల్లూరు వంటి కొన్ని జిల్లాలు మాత్రమే కీలకంగా ఉన్నాయి. సేవారంగం కేవలం కొన్ని పెద్ద నగరాలకే పరిమితమై ఎక్కువ ఆదాయాన్ని జిడిపికి సమకూరుస్తున్నది. పెరుగుతున్న జిడిపి రాష్ట్రంలోని నిరుద్యోగ సమస్యకు ఏమాత్రం పరిష్కారం చూపడంలేదు. ప్రస్తుతం రాష్ట్రంలో నిరుద్యోగ రేటు 6.15 శాతంగా ఉంది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన లేబర్ ఫోర్స్ సర్వే 2020-21 తెలిపిన వివరాలు చూస్తే ఆంధ్ర రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. రాష్ట్ర జనాభాలో 48.4 శాతం ప్రజలు శ్రామికులుగా వివిధ పనుల్లో జీవనం సాగిస్తున్నారు. దేశంలో శ్రామిక భాగస్వామ్యం తక్కువగా ఉన్న రాష్ట్రాలలో ఆంధ్ర రాష్ట్రం ఒకటిగా వుంది. 15-29 వయస్సు మధ్య చూస్తే అతి తక్కువ మంది అనగా పట్టణ ప్రాంతంలో 17 శాతం, గ్రామీణ ప్రాంతంలో 32.9 శాతం మాత్రమే ఉపాధి పొందుతున్నారు. పట్టభద్రులలో చూస్తే ప్రతి 10 మందిలో నలుగురు ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగులుగా ఉన్నారు. మొత్తం చదువుకున్న నిరుద్యోగుల్లో 73 శాతం మంది పట్టభద్రులే. ఎంప్లాయిమెంట్ ఎక్ఛేంజ్‌లలో ఉద్యోగాల కోసం నమోదు చేసుకున్నవారు 16 లక్షల మంది ఉన్నారు. గ్రామీణ ప్రాంతంలో ఉపాధి హామీ పథకం పేదలకు ముఖ్యమైన ఉపాధిగా ఉంది. ఇంజనీరింగ్ చదువుకున్న పట్టభద్రుడికి రాష్ట్రంలో కనీస స్థాయి వేతనం పొందగలిగే ఉపాధి లేదు. అత్యధిక మంది రాష్ట్రం వదిలి ఇరత రాష్ట్రాలకు పని కోసం వలస వెళ్తున్నారు. మరో పరిణామమేమంటే సంఘటిత రంగంలో ఉపాధి తగ్గిపోయి అసంఘటిత రంగం పెరుగుతున్నది. ఉపాధి కల్పనలో ప్రభుత్వ పెట్టుబడులు బాగా తగ్గిపోతున్నాయి. ప్రభుత్వ శాఖల్లో ఖాళీలు భర్తీ చేయటంలేదు. ఫలితంగా సంఘటిత రంగంలో ఉపాధి దారుణంగా పడిపోతున్నది. ప్రైవేటు రంగంలో కూడా సంఘటిత ఉపాధి నామమాత్రంగా మారింది. శ్రమ దోపిడి తీవ్రంగా ఉంది. రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి పెరుగుదల రాష్ట్ర ప్రజల అభివృద్ధికి ఏమాత్రం దోహదం చేయడంలేదనేది స్పష్టమౌతున్నది. వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలు ఆర్థిక వ్యవస్థలో, ప్రజల జీవితాల్లో తీవ్ర సమస్యలు సృష్టిస్తున్నాయి. ప్రభుత్వం చెబుతున్నట్లు పేదరికం, నిరుద్యోగం తగ్గక పోగా ఆదాయ అసమానతలు, జిల్లాల మధ్య అంతరాలు ఎక్కువవుతున్నాయి. వ్యవసాయ రంగం మీద ఆధారపడ్డ అత్యధిక మంది ప్రజల జీవితాలు మెరుగు పడకపోగా ఆహార పంటల నుండి భూమి వ్యవసా యేతర కార్యకలాపాలకు, పెద్ద పెట్టుబడులతో సాగయ్యే కార్యకలాపాలకు మార్పిడి జరుగుతున్నది. ఫలితంగా గ్రామీణ ప్రాంతంలో ఉపాధి సమస్య జఠిలం అవుతున్నది. వ్యాపార, వాణిజ్య, విద్య, వైద్య కార్యకలాపాలు పెద్ద పెద్ద పెట్టుబడులకు కేంద్రమౌతున్నాయి. సంపద కేంద్రీకృతమౌతున్నది.

## మందమర్రి జిఎం ఆఫీస్ లోని క్లర్కులకు 11వ వేజ్ బోర్డు పై అవహన సదస్సు



మంచిర్యాల టౌన్, మే 27, ప్రజాపాలన: మందమర్రి జిఎం ఆఫీస్ లోని క్లర్కులకు 11వ వేజ్ బోర్డు పై అవహన సదస్సు శనివారం రోజు ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మినిమం గ్యారెంటీ బెనిఫిట్ 19 శాతం తీసుకురావడం జరిగిందని కేంద్రం ప్రభుత్వం డి పి ఇ గైడ్లైన్స్ ఉన్నప్పటికీ అలవెన్సుపై 25 శాతం ఒప్పించడం జరిగిందని మెరుగైన ఒప్పందం చేసుకోవడం జరిగింది అని అన్నారు. పదవ వేజ్ బోర్డు కంటే 11వ వేజ్ బోర్డు మెరుగైన వేజ్ బోర్డు అని క్లర్కులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రామకృష్ణాపూర్ బ్రాంచ్ కార్యదర్శి అక్బర్ అలీ బెల్లంపల్లి కార్యదర్శి దాగం మల్లేష్ రామకృష్ణాపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షులు ఇప్పకాయల లింగయ్య మందమర్రి జిఎం ఆఫీస్ పిట్ కార్యదర్శి సాంబశివారెడ్డి నాగేశ్వరరావు మనోహర్ జెట్టి మల్లయ్య దినేష్ సంతోష్ నవీన్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## దశాబ్ది అవతరణ దినోత్సవాలను విజయవంతం చేయాలి: జిల్లా ఎస్పీ కే సురేష్ కుమార్



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి : రాష్ట్ర శతాబ్ది అవతరణ దినోత్సవాలను పురస్కరించుకొని జూన్ 2 నుండి 22 వరకు జిల్లాలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాల గురించి పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో జిల్లా ఎస్పీ శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్, రాష్ట్ర డిజిపి అంజనీ కుమార్, ఆదేశాల మేరకు ఈ దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో చేపట్టే పలు కార్యక్రమాలు దిగ్విజయం చేయడంలో అందర్నీ భాగస్వాములు చేస్తూ ముందుకెళ్లాలని జిల్లా పోలీస్ అధికారులకు తెలిపారు. జూన్ "12న పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే తెలంగాణ రన్" ఏర్పాటు చేయవలసిందిగా సిబ్బందికి ఆదేశించారు. ఈ ఉత్సవాలను ఎక్కడ కూడా ఎలాంటి శాంతి భద్రతలకు ఆటంకం కలగకుండా చర్యల గురించి పోలీస్ అధికారులకు తెలిపారు. ఈ సమావేశంలో అసిఫాబాద్ డిఎస్పి శ్రీనివాస్, కాగజ్నగర్ డీఎస్పీ కరుణాకర్, సిఐలు, ఎస్సైలు, పాల్గొన్నారు.

## నూతన సమికృత కలెక్టరేట్ ను సందర్శించిన జిల్లా పాలనాధికారి వరుణ్ రెడ్డి



మంచిర్యాల బ్యూరో, నిర్మల్, మే 27, ప్రజాపాలన: జూన్ 4 న నిర్మల్ జిల్లాలో నిర్మించిన నూతన సమికృత కలెక్టరేట్ ను ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయనున్న సందర్భంగా శనివారం జిల్లా పాలనాధికారి వరుణ్ రెడ్డి జిల్లా ఎస్పీ ప్రవీణ్ కుమార్ తో కలసి నిర్మాణం పనులను పరిశీలించారు. సమీకృత కలెక్టర్ కార్యాలయ భవన నిర్మాణ సముదాయా నూతన కలెక్టరేట్ కాంప్లెక్స్ లోజిల్లా పాలనాధికారి కలియతిరుగుతూ నిర్మాణ పనులను పరిశీలించారు.. భవనం ఆవరణలో జరుగుతున్న సుందరీకరణ, గార్డెనింగ్, హెలి ప్యాడ్ తదితర పనులు సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తుది మెరుగులు దిద్దే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని, ప్రాంగణంలో గార్డెనింగ్, మొక్కలు నాటడం సుందరికరణ పనులు పెండింగ్ లేకుండా ముఖ్యంగా అన్ని చోట్ల మొక్కలు నాటాలని పచ్చదనం తో కూడిన ఆహ్లాధకరమైన వాతావరణం తలపించేలా మొక్కలు నాటాలని అన్నారు. ముఖ్యమంత్రి పర్యటించే రూట్ మ్యాప్ పరిశీలించారు. ప్రారంబోత్సవం అనంతరం సభ నిర్వహించే స్థలాన్ని ఎస్పీ తో కలసి పరిశీలించారు. ముఖ్యంగా విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలని, మైక్ సిస్టం లో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని వీటి పైన మరింత ప్రత్యేక శ్రద్ద కనబర్చి ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూడాలని అన్నారు. కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు, తదితరులు ఉన్నారు.

## రామగిరి శ్రీపతి కి జాతీయ విశిష్ట సేవ రత్న అవార్డు




మంచిర్యాల టౌన్, మే 27, ప్రజాపాలన: మంచిర్యాల దళిత రత్న అవార్డు గ్రహిత రామగిరి శ్రీపతి కి జాతీయ విశిష్ట సేవ రత్న అవార్డు శనివారం రోజున గోవా రాష్టంలో ఏర్పాటు చేసిన ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ సెమినార్ మీటింగ్ లో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రము నుండి మంచిర్యాల జిల్లా కమిటీ సభ్యుల సహకారం తో తెలంగాణా రాష్ట్ర అంబెడ్కర్ యువజన సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా జాతీయ విశిష్ట సేవా రత్న పురస్కారం షిల్డ్ పత్రం అందుకోవడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. అంతరం ఆయనకు జిల్లా నాయకులు ప్రత్యేక హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అట్కపురం రాయలింగు ఐత పరమేశ్వర్ చాపిడి సందీప్ ఎలకపల్లి పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మాతా రమాబాయి గొప్ప త్యాగమూర్తి

### ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నివాళి



చేవెళ్ల 27 (ప్రజా పాలన):ఆల్ ఇండియా అంబేద్కర్ యువజనసంగం (ఏ ఐ ఏ వై యస్)అధ్యక్షులు కర్కనాగరాజు ఆధ్వర్యంలో మాత రమాబాయ్ అంబేద్కర్ 88వ వర్ధంతి ని ఘనంగా నిర్వహించారు. మూసాపేట్ గూడ్సషెడ్ రోడ్ అంబేద్కర్ స్టేట్యూ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జాతీయ దళిత నాయకులు మల్లు రమేష్ ట్రస్ట్ చైర్మన్ మల్లు ప్రతిభ రమేష్ గారు విచ్చేసి రమబాయ్ చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మాత రమబాయ్ అంబేద్కర్ అంటే ఒక త్యాగం, ఒక పోరాటం ప్రతి మగాడి విజయం వెనకాల ఒక మహిళా ఉంటుంది అనేదానికి రమబాయ్ జీవితమే ఉదాహరణ. చిన్న తనంలోనే అంబేద్కర్ ను బొంబాయి ఫిష్ మార్కెట్ లో వివాహం చేసుకొనే సమయానికి ఆమే వయస్సు తొమ్మిది సంవత్సరాలు ఉన్నత చదువుల కోసం బాబాసాహెబ్ అంబేద్కర్ బరోడా మహారాజు సహకారంతో లండన్ కు వెళ్ళినప్పుడు ఇంటి భాద్యత తీసుకొని పిడుకలు అమ్మి కుటుంబం తో బాటు వచ్చిన డబ్బులు అంబేద్కర్ చదువులకు పంపేదని రమబాయ్ కి పుట్టిన ఐదు మంది సంతానంలో నలుగురు పిల్లల మందులకు డబ్బులు లేక చిన్నతనంలోనే అనారోగ్యంతో మరణిస్తే ఏమాత్రం అధైర్యం పడక బడుగు బలహీనవర్గాల ప్రజల కోసం, హక్కుల కోసం తమ కుటుంబాన్ని త్యాగం చేసిన గొప్ప త్యాగమూర్తి రమబాయ్ అంబేద్కర్ అని వారు తెలిపారు..తన కొడుకు చనిపోయినప్పుడు బాబాసాహెబ్ చేతిలో చిల్లిగవ్వ లేని పరిస్థితి చూస్తూ తన కొంగును చింపి కొడుకు శవం మీద కప్పి ,తమ పరిస్థితిని ఎదుటివారికి చూపించకుండా జాగ్రత్త పడిన విషయం తెలిస్తే బాబాసాహెబ్ కోసం ఆమె పడిన ఆవేదన ఇట్టే అర్థం అవుతుంది.ఆమె జీవిత కాల కష్టమే ఈ రోజున రాజ్యాంగం ద్వారా అనుభవిస్తున్నారు అనడంలో సందేహం లెదు.చివరికి ఈ పోరాటం లో అలిసి జబ్బుపడి చివరగా 1935 మే 27వ తేదీన విషజ్వరంతో మరణించింది. చనిపోయే సమయానికి ఆమె వయస్సు 35 సంవత్సరాలు అని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో రాష్ట్ర దళిత నాయకులు కర్కపెంటయ్య, శ్రామిక మహిళా విభాగం అధ్యక్షులు శారదారెడ్డి,అంబేద్కర్ అమరజ్యోతి అసోసియేషన్ అధ్యక్షులు కర్కడాకయ్య, బిఆర్ స్ యస్సీ సెల్ నాయకులు కర్క రవీందర్, యూత్ కాంగ్రెస్ నాయకులు రచమళ్ళ శేఖర్ గౌడ్,అంబేద్కర్ యువజనసంగం కూకట్పల్లి నియోజకవర్గం అధ్యక్షులు కుతాడి కృష్ణా, కర్కనర్సింగరావు,వెంకన్న డాన్,శశికల,విద్యాసాగర్, పాషా, గురజాల రాజు,రమేష్,నరేందర్,కిరణ్,సుధాకర్,నర్సింగ్, దశరథ్, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాను అభివృద్ధి చేయడంలో జిల్లాలోని ముగ్గురు ఎమ్మెల్యేలు విఫలం

### బిజెపి మంచిర్యాల జిల్లా అధ్యక్షులు రఘునాథ్



మంచిర్యాల టౌన్, మే 27, ప్రజాపాలన: జిల్లాను అభివృద్ధి చేయడంలో జిల్లాలోని ముగ్గురు ఎమ్మెల్యేలు విఫలం అని బిజెపి మంచిర్యాల జిల్లా అధ్యక్షులు రఘునాథ్ మంచిర్యాల పట్టణంలోని ఎం కన్వెన్షన్ లో ఏర్పాటు చేసిన భారతీయ జనతా పార్టీ మంచిర్యాల జిల్లా కార్యవర్గ సమావేశంలో అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కేంద్ర ప్రభుత్వం 9 ఎండ్ల సుపరిపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా మే 30 నుండి జూన్ 30 వరకు మహాజన్ సంపర్క్ కార్యక్రమం చేపట్టాలని బిజెపి రాష్ట్ర కమిటీ పిలుపునివ్వడం జరిగిందని మహా జన్ సంపర్క్ కార్యక్రమంలో భాగంగా మోదీ సంక్షేమ పథకాలు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళడం జరుగుతుందనీ అన్నారు. ఈ 9 ఎండ్లలో రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేసిన ఘనత కేసిఆర్ కే దక్కుతుంది అని ప్రశ్నించారు. నూతనంగా ఏర్పడిన మంచిర్యాల జిల్లాను అభివృద్ధి చేయడంలో జిల్లాలోని ముగ్గురు ఎమ్మెల్యేలు పూర్తిగా విఫలం చెందారని అన్నారు. జిల్లాలో ఉన్న విద్యార్థుల ఉన్నత చదువుల కోసం కావాల్సిన ప్రభుత్వ విద్యా సంస్థలు జిల్లాకు తీసుకురావడంలో ఎమ్మెల్యేలు పూర్తిగా విఫలం అయ్యారని ఆరోపించారు. మంచిర్యాల జిల్లా అభివృద్ధి చెందాలంటే రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి వస్తేనే సాధ్యం అని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇంఛార్జి పల్లే గంగా రెడ్డి ముల్కల్ల మల్లా రెడ్డి పొనుగోటి రంగ రావు మల్లికార్జున్ పెద్దపెల్లి పురుషోత్తం ఆరుముల్ల పోశం నంగునూరి వెంకటేశ్వర్ గౌడ్ రజినిష్ జైన్ మునిమంద రమేష్ సుదర్శన్ జిల్లా పదాదికారులు రాష్ట్ర స్థాయి నాయకులు మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## జూన్ 9న కలెక్టర్ భవనాలను ప్రారంభం చేయనున్న కెసిఆర్



జన్నారం, మే 27, ప్రజాపాలన: రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ జూన్ 9న మంచిర్యాల, నిర్మల్ జిల్లాలో కలెక్టర్ ల భవనాలను ప్రారంభిస్తారని, ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అజ్మీరా రేఖనాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎఆర్ఎస్ కళాశాల ఆవరణలో బిఆర్ఎస్ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కలెక్టర్ కార్యాలయాలు ప్రారంభించిన అనంతరం నిర్వహించే బహిరంగ సభలకు అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వ వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు పోన్కల్ పిఎసిఎస్ ఆధ్వర్యంలో జిలుగు విత్తనాలను పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎరువులు విత్తనాలను అందిస్తున్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా మండల కేంద్రానికి చెందిన దాసరి మురళి మరణించాగా, ఎమ్మెల్యే బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. ఎమ్మెల్యే వెంట మండల అధ్యక్షుడు గుర్రం రాజారాం రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి సులువ జనార్ధన్, వైస్ ఎంపిపి సుతారి వినయ్ కుమార్, పోనకల్ పిఎసిఎస్ చైర్మన్ శీలం రమేష్, మైనారిటీ ప్రధాన కార్యదర్శి మున్వర్ అలీ ఖాన్, పోనకల్ గ్రామపంచాయతీ సర్పంచ్ జక్కు భూమేష్, ఉపసర్పంచ్ బలసాని శ్రీనివాస్ గౌడ్, జిల్లా నాయకులు భరత్ కుమార్ ముత్యం సతీష్ మండల నాయకులు కాంతమణి, కార్యకర్తలు పాల్గొన్నారు

## ఎమ్మార్పీఎస్ జోగిన్ పెల్లి గ్రామ శాఖ ఇంచార్జ్ గా సిద్దే నాగరాజు మాదిగ



కోరుట్ల, మే 27 ( ప్రజాపాలన ప్రతినిధి): మిషన్ 50 రోజుల ప్రణాళికలో భాగంగా కోరుట్ల మండలం జోగన్ పల్లి గ్రామ ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి గ్రామ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం సోమవారం రోజున ఎమ్మార్పీఎస్ కోరుట్ల మండల ఇంచార్జ్ బంగారి ప్రమోద్ మాదిగ అధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ బలవంతుల సురేష్ మాదిగ పాల్గొని మాట్లాడుతూ మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు గ్రామ నిర్మాణంలో భాగంగా జోగన్ పల్లి గ్రామ ఇంఛార్జిగా సిద్ధే నాగరాజును ఏకగ్రీవంగా నియమించామని తెలిపారు.ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ జాతి అంతిమ లక్ష్యం అయిన ఎస్సి ఏబీసీడి వర్గీకరణ సాధించేవరకు కృష్ణమాదిగ నాయకత్వంలో పని చేస్తామని,నా నియమానికి సహకరించిన జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంపెల్లి రాములు, కట్కూరి శ్రీధర్, కాంపెల్లి సంతోష్, దులురి రాజేశం, సిద్దె లక్ష్మణ్, దులూరి సాగర్, కట్కూరి గంగారాం, కాంపెల్లి ముత్తయ్య మరియు గ్రామ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## డివిజన్ అభివృద్ధికి ప్రత్యేక కృషి: కార్పొరేటర్ హరిశంకర్ రెడ్డి



మేడిపల్లి, మే27 (ప్రజాపాలన ప్రతినిధి):పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 25వ డివిజన్ అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తున్నామని స్థానిక కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు డివిజన్లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని మేయర్ జక్క వెంకట్ రెడ్డితో కలిసి కార్పొరేటర్ హరి శంకర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ డ్రైవ్ లో భాగంగా కాలనీలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి చెట్ల మొక్కలను, చెత్త చెదారంను,భవన నిర్మాణ వర్ధ్యాలను జెసిబి మరియు ట్రాక్టర్ సహాయంతో శుభ్రం చేయించారు. అలాగే పీర్జాదిగుడా మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన త్రిబుల్ ఆర్ సెంటర్లో ప్లాస్టిక్ వస్తువులు పాతబట్టలు,పాతబుక్స్,పాతబొమ్మలు మొదలగు రీసైక్లేబుల్ వస్తువులను 25వ వార్డ్ లోని మున్సిపల్ సిబ్బందికి అందించి నగరఅభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఈ శ్రీనివాస్, శానిటరీ ఇన్స్పెక్టర్ జానకి,జగన్, అధ్యక్షకార్యదర్శులు, కాలనీవాసులు,పెద్దలు తదితరులు పాల్గొన్నారు..

## ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం భవన నిర్మాణానికి శంకుస్థాపన



శంకరపట్నం మే 27 ప్రజాపాలన రిపోర్టర్:శంకరపట్నం మండలం కాచాపూర్ గ్రామంలో శనివారం ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి లింగంపల్లి శ్రీనివాస్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంటా మహిపాల్, వైస్ ఎంపీపీ పులికోట రమేష్,మెట్టుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రొద్దుటూరు సంజీవరెడ్డి, గద్దపాక సొసైటీ చైర్మన్ గుర్రాల తిరుపతిరెడ్డి, గ్రామ సర్పంచ్ కొండ్ర రాజయ్య, ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, కల్వల గ్రామ సర్పంచ్ బద్రయ్య, పిహెచ్సి వైద్య సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

### సిపిఎం చేవెళ్ల డివిజన్ కన్వీనర్ అల్లి దేవేందర్, శంకర్పల్లి మండలకార్యదర్శి ఏనుగు మల్లారెడ్డి





చేవెళ్ల మే 27,(ప్రజాపాలన):చేవెళ్ల నియోజనవర్గం లోని శంకర్పల్లి పట్టణ కేంద్రంలో సిపిఎం ఆధ్వర్యంలో పేదల సమస్యలు తెలుసుకోవడం కోసం, అయ్యప్ప రెడ్డి గూడా, గణేష్ నగర్, సింగాపురం, సాయి నగర్ కాలనీలలో సిపిఎం సర్వే నిర్వహించారు.ఈ సర్వేలో పేద ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను సిపిఎం పార్టీ గుర్తించగా, ముఖ్యంగా త్రాగడానికి మంచినీరు, విద్యుత్ సరఫరా లేక పురుషులు స్త్రీలు చిన్నపిల్లలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, గత 20 30 సంవత్సరాల నుంచి శంకరపల్లి పట్టణంలో నివాసం ఉంటున్నారు వారికి ఆధార్ కార్డు రేషన్ కార్డు ఓటర్ కార్డు స్థానికంగా పట్టణ కేంద్రంలో ఉన్న ప్రభుత్వం నుంచి అందే ఒక్క పథకమైన వారికి అందడం లేదని అన్నారు. ముఖ్యంగా వారికి సొంత ఇల్లు లేవన్నారు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు ఈ పేదల నిజమైన అర్హులని అన్నారు. ప్రభుత్వం స్పందించి ఈ పేద ప్రజలకు డబుల్ బెడ్ రూమ్ ఇచ్చేంతవరకు పోరాటం నిర్వహిస్తామని అన్నారు. శంకర్పల్లి పట్టణంలో ప్రజా ప్రతినిధులు అధికారులు వెంటనే స్పందించి పేద ప్రజల సమస్యలు పరిష్కరించాలని అనువైన వారికి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు రావడానికి మంచినీరు విద్యుత్ తదితర సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు నరసింహ శ్రీనివాస్ మల్లేష్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## జాబ్ సెమినార్ వాల్ పోస్టర్ విడుదల




మంచిర్యాల టౌన్, మే 27, ప్రజాపాలన: జాబ్ సెమినార్ నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని లక్షెట్టిపేట్ ఎస్. ఐ. ఎస్. లక్ష్మణ్ శనివారం అన్నారు. అనంతరం జాబ్ సెమినార్ వాల్ పోస్టర్ స్థానిక పోలీస్ స్టేషన్ లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీట్సల్ సాఫ్ట్వేర్ సొల్యూషన్స్ సంస్థ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఆదివారం లక్షెట్టిపేట్ లోని కళాంజలి ఏసీ ఫంక్షన్ హల్ నందు ఉదయం 9:30 గంటలకు జాబ్ సెమినార్ ఉంటుందని అన్నారు. మంచిర్యాల పరిసర ప్రాంత విద్యార్థిని విద్యార్థులు నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉద్యోగం శిక్షణ కోరకు ఇంటర్మీడియట్ డిగ్రీ పాస్ ఫెయిల్ అయిన వారు కూడా అర్హులే వెంటనే రిజిస్ట్రేషన్ కోసం పూర్తి వివరాలకు అరవింద్ కోలా ఫోన్ నెంబర్ 9000694173 ను సంప్రదించగలరు అని సూచించారు. ఈ కార్యక్రమంలో బీట్సల్ సాఫ్ట్ సొల్యూషన్స్ సంస్థ సిఈఓ ఫౌండర్ దుంపల సన్నీ అడ్లూరి మధుకర్ దుంపల రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి: ఎమ్మెల్యే



శంకరపట్నం మే 27 ప్రజాపాలన రిపోర్టర్:శంకరపట్నం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలపై సన్నాహక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రసమయి ముఖ్య అతిథిగా హాజరై దిశా నిర్దేశం చేశారు. తెలంగాణ రాష్ట సాధన కోసం ఎంతో మంది అమరులయ్యారని గుర్తు చేశారు. స్వరాష్ట్రం కోసం 1200మంది తమ ప్రాణాలను త్యాగం చేసారనీ, తెలంగాణ రాష్టం కోసం ఎంతో మంది బలిదానాలకు పాల్పడి అమరులయ్యారని, వారిని గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని, వారి త్యాగాలు ప్రజలకు తెలియజేయాల్సి ఉందన్నారు. జూన్ 2 నుంచి 22వ తేదీ వరకు రోజుకో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాళేశ్వరం జలాలతో మానకొండూర్ నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు నీళ్లు ఇస్తున్నట్లు తెలిపారు. మహిళల సంక్షేమానికి ప్రభుత్వంగా కృషి చేస్తున్నందున వారికి ఒక రోజును కేటాయించి ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. 21న సాయంత్రం మానకొండూర్ నియోజకవర్గ కేంద్రంలో భారీ బహిరంగ సభను నిర్వహించి, ఉత్సవాలకు ముగింపు పలుకుతామని ఈ వేడుకలను విజయవంతం చేయడానికి ప్రజలు, ప్రజాప్రతినిధులు, బీ.ఆర్.ఎస్. పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఎమ్మెల్యే రసమయి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అద్యక్షురాలు ఉమ్మెంతల సరోజన, జెడ్పీటిసి లింగంపల్లి శ్రీనివాస్ రెడ్డి, తహశీల్దార్ గూడూరి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ పులికోట రమేష్, వివిధ గ్రామల సర్పంచ్ లు, ఎంపీటిసిలు, వివిద శాఖల మండల స్థాయి అధికారులు, బిఆర్ఎస్ నాయకులు తధితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సబ్సిడీపై ఎల్ఈడి బల్బులు పంపిణీ




మధిర మే 27 ప్రజా పాలన ప్రతినిధి: వెలుగు మండల సమాఖ్య కార్యాలయం నందు శనివారం ఏపిఎం రాంబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రభుత్వ సబ్సిడీ ఫై ఎల్ ఈ డి బల్బుల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీపీ మేండెం లలిత, ఎంపీడీవో సిలార్ సాహెబ్ ప్రారంభించారు. గ్రామీణ విద్యుత్ వినియోగదారులకు గొప్ప అవకాశము అని గత 3 నెలలలో ఏదైనా ఒక కరెంట్ బిల్లును చూయించి మెరుగైన మరియు మన్నికైన 5 సరికొత్త 12 మరియు 7 వాట్ ల ఎల్ఈడి బల్బులను 3సం? వారంటీతో పొందండి. ఒక్కో బల్బు కేవలం 25 రూపాయలు మాత్రమే (మీ పాత 60%ష% లేదా 100%ష% ల ఎర్ర బల్బులు ఇచ్చినచో ఒక్కొక్క బల్బ్ రూ. 15/- మాత్రమే) ఒక్క మీటరుకు 5 బల్బులు మాత్రమే ఇవ్వబడును. లిఉదయం 7 గంటల నుండి అన్ని గ్రామాల్లోని గ్రామదీపిక వద్ద నుండి ఈ ఎల్ఈడి బల్బులను పొందవచ్చు. కావున లి5 బల్బ్ లను 3 సంవత్స రాల వారంటీలి తో పొందగలరు , కావున గ్రామస్తులందరు ఈ సదవకాశాన్ని ఉపయోగించు కోవాలని తెలియజేశారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సీసీ లు, వివో ఏ లు ,సోలార్ సంస్థ నుండి రమేష్ పాల్గొన్నారు.

## బహుజన రాజ్యం వస్తే బెల్లీ లలితక్క విగ్రహంతో పాటు, భువనగిరికి ఆమె పేరు పెట్టి జయంతి, వర్ధంతులను అధికారికంగా జరుపుతా



ఇబ్రహింపట్నం మే తేది 27 ప్రజాపాలన ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు.. తేది 26.05.2023 రాత్రి 7.00 గంటలకు తెలంగాణ గాన కోకిల, వీర నారి, కుర్మ ముద్దు బిడ్డ, బెల్లి లలిత గారి 24వ వర్ధంతి సంధర్భంగా బహుజన్ సమాజ్ పార్టీ ఇబ్రహీంపట్నం అసెంబ్లీ కమిటీ ఆధ్వర్యంలో తుర్కయంజాల్ మున్సిపాలటీ అధ్యక్షులు లివద్దిగల్ల బాబు గారిలి అధ్యక్షతన నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా జిల్లా కార్యదర్శి అసెంబ్లీ ఇంచార్జ్జీ లిపళ్ళాటి రాములు గారు, గ్యార మల్లేష్ మాట్లాడుతూ..లలితక్కది సహజ మరణం కాదని నేటి బహుజన తరాలకు తెలవాల్సిన అవసరం ఉందనీ, 1990లలో ఉమ్మడి నల్గొండ రంగారెడ్డి జిల్లాల్లో ఆధిపత్య భూస్వాముల దోపిడికి వ్యతిరేకంగా గజ్జె కట్టి, గళం విప్పిన బెల్లి లలితక్కను ఈ దోపిడి దొరలు అక్కసుతో నయీం గ్యాంగుతో చేతులు కలిపి హత మార్చి 17 ముక్కలుగా నరికి భువనగిరి బావుల్లో పడేసిన దుర్మార్గులు. ఈ గ్యాంగుల వెనకాల ఎవరెవరు మంత్రులున్నరు, వాళ్లు ఇప్పుడెక్కడ ఉన్నరో, ఎన్ని వందల కోట్ల ఆస్తులు ఎట్ల సంపాదిస్తున్నారో మన కళ్లముందరే కేసీఆర్ గారి కనుసన్నలలోనే తుంగతుర్తి లాంటి ప్రాంతాల్లో ఈ గ్యాంగులు స్వైర విహారం చేస్తున్నవి!బహుజనులారా, ఇప్పటికైనా అర్థమైందా మనం ఓట్లను అమ్ముకోని మన బిడ్డలను చంపెటోళ్లకే మళ్లీ మళ్లీ ఓటేస్తున్నం. వీళ్లిచ్చే తాయిలాలకు ఆశపడి గ్యాంగులను ఏర్పాటు చేసుకొని మనం మనమే చంపుకుంటున్నాం. ఇకనైనా కళ్లు తెరచి మన రాజ్యం మనమే తెచ్చుకుందాం. ఇప్పుడు తెలంగాణలో ఉన్న దోపిడి దొరల ప్రభుత్వం లలితక్క లాంటి యోధులను గుర్తించే అవకాశం లేదు. అందుకే ఇవన్ని మన రాజ్యం లోనే చేసుకుందాం. జోహార్ బెల్లి లలితక్క.. ఈ కార్యక్రమంలో.అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి గోపగళ్ళ దాస్, కార్యదర్శి యంజాల ప్రహ్లాద్, కోశాధికారి లికొండ్రు రఘుపతి, జిల్లా మహిళా కన్వీనర్ లికంబాల పల్లి శాంత, సుజాత, తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఉపాధ్యక్షులు మేతరి కుమార్ , కార్యదర్శి జంతుక సైదులు , కోశాధికారి పట్నం రమేష్ కురుమ ప్రధాన కార్యదర్శి భూతం రమణ ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షులు మచ్చ మహేందర్ , ఆదిభట్ల మున్సిపాలిటీ అధ్యక్షులు బంగారిగళ్ళ మహేందర్ , కార్యదర్శి జోగు స్వామి, అబ్దుల్లాపూర్ మెట్ మండల కార్యదర్శి చిత్రం కృష్ణ , బంగారి మైసయ్య , చెక్క రంజిత్‌లి తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభోత్సవాలకే పరిమితమైన కొనుగోలు కేంద్రాలు

### మార్కెట్ యార్డ్ లో రేకుల షెడ్ లలో ఎండకు ఎండుతూ పడి కాపులు కాస్తున్నారు



మధిర మే 27 ప్రజాపాలన ప్రతినిధి:మధిర కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ తరఫున మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను సందర్శించిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు రైతులు తమ బాధలు కాంగ్రెస్ నాయకులకు తెలిపారు. ఈ సందర్భంగా మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లిసూరంశెట్టి కిషోర్‌లి మాట్లాడుతూ మధిర నియోజకవర్గం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మధిర పట్టణం లో మార్కెట్ యార్డు నందు అధికార పార్టీ వాళ్లు ఆర్భాటంగా ప్రారంభించి వారం రోజులు అయినా ఒక్క గింజ కూడా మొక్కజొన్నలు కొనలేదు, ప్రజలు రాత్రి, పగలు కాపలాలు కాయలేక పందులతో తట్టుకోలేక ఇబ్బంది పడుతున్నారు. తేమ శాతం ఎక్కువ ఉంది అని లోటు చెప్పి గత వారం నుంచి కూడా అదే తేమ ఉంటుందని మాయమాటలు చెబుతూ రోజూలు గడుపుతున్నారు.. రైతులు మార్కెట్ యార్డ్ లో రేకుల షెడ్ లలో ఎండకు ఎండుతూ పడి కాపులు కాస్తున్నారు, మార్కెట్ యార్డ్ లో కనీసం మంచినీటి సదుపాయం లేదు.. అది ఏమని అడగగా మధిర సొసైటీ శ్రీనివాసరావు తేమశాతం ఎక్కువ ఉంటుంది అని కుంటి సాకులు చెప్పి రైతులు చివరకు మేము బయటకు వెళ్లి ప్రైవేట్ వారికి అమ్ముకునే విధంగా ప్రవర్తిస్తున్నారు.. మధిర మార్కెట్ పరిధిలో 90% ప్రైవేట్ వారికి అమ్ముకోగా 10 శాతం మంది రైతులు వచ్చినా కూడా వారి మొక్కజొన్నలు కొనే పరిస్థితి లేదు.. రేపు సోమవారం లోపు కొనకపోతే రోడ్లమీదకి వచ్చి ధర్నాలు చేయాల్సి వుంటుంది అని ప్రతి ఒక్క గింజ ప్రభుత్వం వారు కొనుగోలు చేయాలి అని కాంగ్రెస్ పార్టీ తరఫున డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలోమధిర మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు లిదుంప వెంకటేశ్వర రెడ్డిలి మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు లిదారా బాలరాజులి సైదల్లిపురం సర్పంచ్ లిపులి బండ్ల చిట్టిబాబులి మాజీ సర్పంచ్ లికర్నాటి రామారావులి కాంగ్రెస్ నాయకులు లిఆవుల కిరణ్, జహంగీర్, మాగం ప్రసాద్, జమీల్ పాషాలి మొక్కజొన్న రైతులు లిబాదిగం కోటిరెడ్డి. బాధాకృష్ణారెడ్డి,గోరక నర్సిరెడ్డి, బాధా ఎర్రకోటిరెడ్డి,బండి కృష్ణారెడ్డి, వనకూరి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జూన్ 4 న హైదరాబాద్‌లో లింగాయత్ మహా ర్యాలీ...



హైదరాబాద్ ((ప్రజాపాలన ప్రతినిధి ): మానవతా వాది, యుగపురుషుడు బసవేశ్వరుడి భోధనలు అందరికి ఆచరనీయమని, ఆయన భోధనలు చాటడానికి లింగాయత్ సమన్వయ సమితి ఆధ్వర్యంలో జూన్ 4 వ తేదీన హైదరాబాద్ లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ నుండి బసవేశ్వరుడి విగ్రహం వరకు మహా ర్యాలీ నిర్వహించనున్నట్లు లింగాయత్ సమన్వయ సమితి ప్రతినిధులు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం లో వీర శైవ లింగాయత్ లు చాలా వెనుక బడి ఉన్నారని, లింగాయత్ ల ఐక్యత చూపించడమే లక్ష్యంగా, లింగాయత్ ల అభివృద్ధిని కాంక్షిస్తూ, హక్కులను సాధించడం కోసం మహా ర్యాలీ చేపడుతున్నట్లు వారు తెలిపారు. ఈ ర్యాలీ లో తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర నుండి పెద్ద ఎత్తున లింగాయత్ లు పాల్గొనాలని పిలుపునిచ్చారు. లింగాయత్ ల ప్రధాన డిమాండ్ లు అయిన తెలంగాణ లోని లింగాయత్ లను కేంద్రం ఓబిసి జాబితాలో చేర్చాలి, ప్రతీ లింగాయత్ కుటుంబానికి లక్ష రూపాయలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 40 లక్షలకు పైగా ఉన్న లింగాయత్ లకు అన్ని రాజకీయ పార్టీ లలో ఎం ఎల్ ఎ, ఎం పి సీట్లను కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో లింగాయత్ సమన్వయ సమితి ఆలిండియా వైస్ ప్రెసిడెంట్ మాజీ ఎం పి సురేష్ షెట్కార్,పి.రాష్ట్ర గౌరవాధ్యక్షులు సంగమేష్,రాష్ట్ర అధ్యక్షుడు వి. ఈశ్వరప్ప,అవినాష్ బోసికర్,బి. హనుమంతు, శంకరప్ప పాటిల్,రాజేశ్వరి, బి. రేణుక,విజయ్ కుమార్,కాల్వ మల్లికార్జున్, అనిల్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

## శిథిల దేవాలయాల జీర్ణోద్ధరణ పూర్తి సహకారం: జడ్పిటిసి పట్నం అవినాష్ రెడ్డి



ప్రజా పాలన ప్రతినిధి షాబాద్ షాబాద్‌లి మండలంలో శిథిలావస్థలో ఉన్న దేవాలయాల జీర్ణోద్ధరణ కోసం తనవంతుగా పూర్తి సహకారం అందిస్తానని జెడ్పిటిసి పట్నం అవినాష్ రెడ్డి అన్నారు. మండలంలోని సంకేపల్లి గూడ గ్రామంలో ఇటీవల పునర్నిర్మించిన హనుమాన్ దేవాలయాన్ని బొడ్రాయి ప్రాంతాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్ దేవాలయం పునరుద్ధరణ కోసం గ్రామస్తులు తనను కోరిన వెంటనే రూ. 2.50 లక్షలు అందించామని చెప్పారు. అలాగే మండలంలోని పలు గ్రామాలలోని దేవాలయాల పునర్నిర్మానాలకు ఆర్థిక సహాయం చేస్తున్నట్లు వెల్లడించారు. గ్రామంలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణాల కోసం, మహిళా భవనం కోసం సర్పంచ్ దర్శన్, ఉప సర్పంచ్ రాజేందర్రెడ్డి, మహిళలు వినతి పత్రాలు అందించగా సానుకూలంగా స్పందించి, అందరి సహకారంతో నిధులను అందించే ఏర్పాటు చేస్తామన్నారు. దేవాలయ నిర్మాణానికి మొదటి దాతగా ముందుకు వచ్చిన జెడ్పిటిసి అవినాష్ రెడ్డిని గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. గ్రామంలోని మంచినీటి సమస్య పరిష్కారానికి విచ్చేస్తానని అవినాష్ రెడ్డి వెల్లడించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నక్క శ్రీనివాస్ గౌడ్, గ్రామస్తులు, వార్డు సభ్యులు, డ్వాక్రా మహిళలు, పాల్గొన్నారు.

## దండేకర్ సాయి కిరణ్ పార్థివ దేహానికి నివాళు లర్పించిన బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్



ఇబ్రహింపట్నం మే తేది 27 ప్రజాపాలన ప్రతినిధి:ఇబ్రహీంపట్నం నియోజక వర్గం మంచాల గ్రామ ఉప సర్పంచ్ దండేకర్ జ్ఞానేశ్వర్ కుమారుడు సాయి చరణ్ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకుని ఆయన పార్థివదేహానికి నివాళులర్పించిన బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్ ఈ విషాద కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ ఏర్పుల చంద్రయ్య మంచాల మండల పార్టీ అధ్యక్షులు చీరాల రమేష్ , సర్పంచ్ జగన్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి కాట్రోత్ బహదూర్ , యువత అధ్యక్షులు బద్రీనాథ్,రాయపోల్ మాజీ సర్పంచ్ పాశం అశోక్ గౌడ్, శంకర్, రావుల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవు: ఎస్సై చంద్రశేఖర్



శంకరపట్నం మే 27 ప్రజాపాలన రిపోర్టర్:శంకరపట్నం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల వ్యవసాయ అధికారి ఆర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని సీడ్స్, ఫెర్టిలైజర్ షాపుల యజమానులతో నకిలీ విత్తనాల అమ్మకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేశవపట్నం ఎస్ఐ దేశ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ రైతులకు నకిలీ విత్తనాలు అమ్మకాలు జరిపితే శాఖ పరమైన చర్యలు తప్పవని, అలాంటి వారిపై పిడి యాక్ట్ కేసు నమోదు చేసి షాప్ సీజ్ చేయడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ శ్రీకాంత్, ఫెర్టిలైజర్ షాప్ యజమానులు, ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

## పద్మ-2024 అవార్డుల కొరకు దరఖాస్తుల స్వీకరణ"

### జిల్లా కలెక్టర్ హేమంత్ బోర్కడే



ఆసిఫాబాద్ జిల్లా మే27 (ప్రజాపాలన,ప్రతినిధి) : భారత హెూమ్, వ్యవహారాల మంత్రిత్వ శాఖ - న్యూఢిల్లీ వారి ఆధ్వర్యంలో పద్మ-2024 అవార్డుల కొరకు ఆన్ లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళా రంగం, అక్షరాస్యత, విద్య, క్రీడ, వైద్య రంగాలు, సామాజిక బాధ్యత, సైన్స్-ఇంజనీరింగ్, ప్రజల వ్యవహారాలు, పౌర సేవలు, కార్మిక, పరిశ్రమల రంగాలలో విశేష సేవలు అందించిన జిల్లా ప్రజలు అవార్డు కొరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇందు కొరకు ఆన్ లైన్ లో రాష్ట్రీయ పురస్కార్ పోర్టల్ వెబ్సైట్ ద్వారా 2023 సెప్టెంబర్ 15వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవచ్చని, ఆయా సంబంధిత రంగాలలో విశేష సేవలు అందించిన వారు అవార్డుకు అర్హులని తెలిపారు.

## సివిల్ సర్వీస్ లో ర్యాంకు సాధించిన జిల్లావాసి, డోంగ్రే రేవయ్య కు సన్మానం": జిల్లా ఎస్పీ కే సురేష్ కుమార్



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సురేష్ చారి,మే 27.) : ఇటీవల విడుదలైన ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ లో 410 ర్యాంక్ సాధించి నటువంటి ఆసిఫాబాద్ జిల్లాలోని రెబ్బెన మండలం తుంగెడ గ్రామానికి చెందిన డోంగ్రే రేవయ్య ను,జిల్లా ఎస్పీ కే సురేష్ కుమార్ శనివారం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో సన్మానించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ సురేష్ కుమార్ మాట్లాడుతూ కృషి, పట్టుదల, ఉంటే ప్రతి ఒక్కరూ విజయం సాధించగలరని అని తెలియజేయడానికి డోంగ్రే రేవయ్య, ప్రత్యక్ష నిదర్శనన్నారు. చిన్న మారుమూల గ్రామమైన రెబ్బెన మండలంలోని తుంగెడ కు చెందిన సాధారణ వ్యక్తి పట్టుదలతో చదివి సివిల్ సర్వీస్ సాధించడం జిల్లాకే గర్వకారణమని, ప్రతి ఒక్కరికి స్ఫూర్తినియమిస్తుందని అన్నారు. కావున జిల్లాలోని ప్రతి యువత కష్టపడి చదివి రేవయ్యను స్ఫూర్తిగా తీసుకొని జీవితంలో మంచి విజయాలు సాధించాలని తెలిపారు.

# ‘భారతీయరత్నం’ ఎన్టీఆర్ కు శతంజలి


దాసన్న గారి కృష్ణమూర్తి


**ఎన్టీఆర్ అనే మూడక్షరాలు తెలుగు గడ్డపై సామాన్యుడుగా పుట్టి, వ్యక్తిగా, నటుడుగా, సమాజ సేవకుడుగా, దేశభక్తుడిగా, తెలుగు వల్లభుడిగా, కథనాయకుడిగా, ప్రజానాయకుడు గా, తెలుగు నేలపై నడయాడి, మట్టివాసనలు పీల్చి, భారత పౌరుడిగా ఎన్టీఆర్ జీవనం, జీవితం, తపించి, తరించింది. తెలుగుతెరపై భారత ఇతిహాస, చరిత్ర రూపాల పునర్ముద్రికుడు ఎన్టీఆర్. ఎన్టీఆర్ విశిష్ట వ్యక్తిత్వం గురించి కొంత విభిన్న శైలిలో శత మహోత్సవాల ముగింపురోజున అభిమానిగా దాసన్నగారి కృష్ణమూర్తి సమర్పించు అక్షర నివాళులు...**

**ఎన్టీఆర్ గురించి :** అదొక పల్లెటూరు, ఆప్రాంతం దేశభక్తి, రాజకీయ చైతన్యం, వామపక్ష, నాస్తిక హేతువాద, సంస్కరణల, సాంఘిక, సాంస్కృతిక , కళా కేంద్రంగా విరాజిల్లుతున్న ప్రముఖ ప్రాంతం.. విజయవాడ, గుంటూరు, తెనాలి ప్రాంతాలకు కాస్త దగ్గిరలో వున్న నిమ్మకూరు అనే చిన్నపల్లెటూరు ఎన్టీఆర్ పుట్టినఊరు. అమ్మానాన్నలు కీ.శే.లు వెంకటరావమ్మ నందమూరి లక్ష్మయ్య చౌదరి, ఒక తమ్ముడు త్రివిక్రమరావు . వీరిది వ్యవసాయ కుటుంబం. అరకొర పొలం, దాంట్లోనే జీవనం కుటుంబం కష్టపడాల, పొలం పనులు చేయాల, కాస్తోకూస్తో పండించి, అమ్ముకొని, వచ్చిందాంట్లో ఇంట్లో అందరూ బతకాల. ఎన్టీఆర్ చదుకోటానికి ఆవూరిలో బడి లేదు, దగ్గర్లో ఎలాంటి అవకాశాలు లేవు. నిమ్మకూరులోనే వీధిబడిలో అక్షరాలు దిద్దటం మొదలు.. పట్టుదలగా విజయవాడ, గుంటూరు దాకా వెళ్లి బి.ఏ.. డిగ్రీ 1947 ఏప్రిల్ 11 తేదీన పూర్తి చేశారు. అప్పటికే అనగా 1944 మే నెల 21 న బసవతారకం గారితో వివాహం, ఎన్టీఆర్ చదువుకుంటూనే తమ్ముడు త్రివిక్రమరావుతో కలసి, చిన్న చిన్న వ్యాపారాలు మొదలెట్టి, లాభసాటి లేక మానుకోవడం జరిగింది. అయితే తాను 7 వ తరగతి నుండే పాలవ్యాపారం చేసేవాడు. డిగ్రీ అయ్యాక ఇక సహజంగానే ఉద్యోగ ప్రయత్నం, అందులో సబ్రిజిస్ట్రార్ గా ఉద్యోగం రావటం, అంతా బాగానే వుంది. కానీ ఒకవైపు అక్కడి ఆఫీసులో పద్ధతులు నచ్చక పోవటం, మరోవైపు సినిమాలలో అవకాశాల కోసం మరో ప్రయత్నం.. ఇలా ఉద్యోగం, సినిమాలు . 1947 లోనే అప్పటికే సినీ దర్శక ప్రముఖులు ఎల్వి ప్రసాద్ గారి అన్వేషణలో బి ఏ సుబ్బారావు గారితో విజయవాడ దుర్గా కళామందిర్ కు విచ్చేసినప్పుడు ఎన్టీఆర్ వెళ్లి కలవటం, మద్రాసుకు రమ్మని చెప్పటం జరిగింది. అలా సినిమా ప్రస్థానంలో నిర్మాత కృష్ణవేణమ్మ అంగీకారంతో, 1949 మనదేశం లో చిన్న వేషంతో తొలి అడుగులు. ఉద్యోగం వదలి, సతీమణి తారకమ్మ నగలు అమ్మిన డబ్బుతో మద్రాసు కు శాశ్వతంగా మకాం.ఇక్కడనుండి జీవితం నేర్పిన పాఠాల వల్ల ఆర్థిక క్రమశిక్షణ, జాగ్రత్తలు నేర్చుకున్నాడు. ఎంతో బాధ్యతగా ఎదిగాడు. నీళ్లు తాగి ఆకలి తీర్చుకున్నాడు, కాలినడకన స్టూడియోల చుట్టూ మైళ్ల కొద్దీ నడచి, అవకాశాల కోసం శ్రమించాడు. ఆడంబరాలకు, విలాసాలకు, అనవసర వినోదాలు, ఖర్చులకు దూరంగా ఉండేవారు. ఎంతటి క్లిష్టపరిస్థితిలో కూడా డబ్బుకోసం అప్పులు చేయడం, ఇతరులతో ఆర్థిక లావాదేవీలు చేసేవాడు కాదు. వచ్చిన దాంట్లోనే పొదుపుగా, అదుపుగా ఉండేవాడు.


కేవలం తన కష్టాన్ని నమ్ముకున్నాడు,

**ఇలా ఒక్కోమెట్టు దాటి పైకెదిగారు.**

ఎన్టీఆర్ కు ఆత్మవిశ్వాసం, అత్మాభిమానం, దృఢసంకల్పం మెండుగా ఉండేవి. సంపాదన, అవకాశాలు వున్నప్పుడు కూడా ఊరకనే తినికూర్చోవటం తన ‘లైఫ్ డిక్షనరీ’ లోనే లేదు. తనకు ప్రమాదాలు జరిగినా, ఆరోగ్యం బాగోలేక పోయినా ఎప్పుడూ విశ్రాంతి ఎరుగని శరీరం. దిన, వార, రాజకీయ పత్రికలు చదవటం కానీ , రాజకీయ పార్టీలు, నాయకులు, సభలు, సమావేశాలు, వేడుకలు, పైరవీలకు వెళ్ళటం,పూర్తిగా దూరంగా ఉండేవారు. ఇలా ఎన్టీఆర్ సిద్ధాంతమే ఓప్రత్యేకం. ఎన్టీఆర్ ది అందమైన ముఖవర్చస్సు, ఉత్తమ విద్యార్థి, తెలుగు ప్రాంతీయ భాషాభిమాని, దేశభక్తి, ఆధునికత, శాస్త్రీయ, హేతువాద, కమ్యూనిజం, భారతీయ సంప్రదాయ, సంస్కృతి



సంస్కరణాభిలాషి, మహిళా పక్షపాతి, ప్రాంతీయ రంగస్థల నటుడు, సామాజిక ప్రయోజనం కోసం నాటకాలు ఆడేవారు, మంచి చిత్రకారుడు, అందమైన చేవ్రాలు, ఏక సంతాగ్రాహి. విద్యార్థి దశలోనే ఎన్.యే.టి నాటక సంస్థను ఏర్పాటు చేశారు. మిత్రులతో ఒకే లక్ష్యం అన్నట్లు నాటకాలు. ఎవరి ఖర్చు వారిదే అయినా, నాటకాల పట్ల ఎవరికీ వ్యాపార ధోరణి, లాభాపేక్ష లేదు. అన్నీ దేశ ప్రయోజనం కోసమే. అప్పుడు బ్రిటిష్ పరిపాలన కూడా. ఇక సినిమాలలో ఎన్టీఆర్ వ్యక్తిత్వానికి, అభిరుచులకు, సాంఘిక ప్రయోజనాలకు అనుగుణంగా సినిమా కథలు, అవి సాంఘికం, పౌరాణికం, చారిత్రాత్మకం, జానపదం, కళాత్మకం ఏవైనా, వాటిలో సన్నివేశాలు, పాత్రలు, పాటలు, సంభాషణలు, సందేశాలు తన అభిరుచికి ఏమాత్రం రాజీ పడకుండా, సాధారణ ధోరణికి భిన్నంగా, ఆలోచింప జేసేవిధంగా, తన సినిమాల నిర్మాణం ఉండేది. నిర్మాత, దర్శకులు, సాంకేతిక నిపుణుల ఎంపిక, అన్నింటిలో పట్టు ఉండేది. ఆహారం మొదలు ఆహార్యం వరకూ, అన్నీ విభిన్నమే. తానే ఓ పరిశీలకుడు, పరిశోధకుడు, విమర్శకుడు, అన్నిటా ప్రావీణ్యుడు. ఇవన్నీ తన స్వంత చిత్రాలలో మరింతగా ఉండేది, బయటి నిర్మాతలకోసం వ్యాపార విలువలతో పాటు కొంత తన శైలి, తన సిద్ధాంతం ఉండేలాగా, సామాన్య, అతి సాధారణ ప్రేక్షకులను ఆకట్టుకునే వినోదం, విజ్ఞానం ఆకర్షణలతో సినిమా చూసేవారు తన సినిమాలు చూస్తున్నంత సేపు ఏ ఊహల్లోనో, తేలిపోయే విధంగా, సినిమా ఉండేలాగ చూసుకునేవాడు.ప్రత్యేకించి, ఎన్టీఆర్ దినచర్యలు ఉదయం 3 గంటలకే మొదలైతే, కాలకృత్యాలు, వ్యాయామం, మసాజ్, స్నానం, పూజ, భోజనం, నిర్మాతలతో చర్చలు, తర్వాత అభిమానులతో కలవటం, ఇతర సందర్శకులతో మాట్లాడేవారు, ఇంట్లోనే మేకప్ వేసుకుని, షూటింగ్ కు బయలుదేరు నపుడు, భూతరాజు వచ్చి దిష్టి తీయటం, శ్రీమతి ఎదురురాగా, సీతా రాములు విగ్రహాలకు నమస్కరించి, తానే డోరు తెరచుకుని కారులో కూచోగా, భూతాలరాజు టెంకాయ కొట్టితే, ఆ కారు కదిలేది. ఇదంతా దినచర్య, అయితే తనకంటే ముందుగా తన ఛైర్, ఇతర వస్తువులు షూటింగ్ ప్రదేశానికి చేరేవి.అంటే రామారావు గారు షూటింగ్ కు వస్తున్నారని ఒక సమాచారం లాంటిది.సినిమా షూటింగ్ లో నిర్మాత దర్శకులతో ఎలాంటి జోక్యం చేసుకునే వారుకాదు. తానెంతటి సీనియర్ గొప్ప హీరో అయినా సరే ఇతర చిత్రాలకైతే దర్శకుడు చెప్పినట్లే విని నటించేవారు. పౌరాణిక చిత్రాల షూటింగ్ లో పాత్రలను బట్టి నియమ, నిష్ఠలు, నిబంధనలను కఠినంగా పాటించే వారు. ఉదా : రాముడు, కృష్ణుడు వంటి దేవతల పాత్రకు వేసేటప్పుడు పూర్తిగా శాఖహార భోజనం, నేలపైనే నిద్ర, ఇక సూయోధన, రావణ వంటి ప్రతినాయక పాత్రలప్పుడు సుష్టుగా మాంసాహార భోజనం చేసేవారు. సినిమా రంగంలో తొలి పారితోషికం 250/- తో మొదలెట్టి, నెలకు కేవలం 500- జీతం అగ్రిమెంటు మీద విజయా వారి బ్యానర్ లో పనిచేశారు. అక్కడనుండి ‘ల’ కారాలు దాటి ‘కో’ వరకూ అత్యధిక పారితోషికం తీసుకున్న ఏకైక హీరోగా రికార్డు సృష్టించారు. సినీరంగంలో కేవలం ఒక హీరో, నటుడుగానే కాదు, బహుముఖ పాత్రలు పోషించారు. నటనకు భాష్యం, నటుడుకి అభిమాన సంఘాలు, సినిమాలకు మర్షియల్ హిట్లు, ఇండస్ట్రీ రికార్డులు ఎన్టీఆర్ తోనే మొదలై తారాస్థాయికి చేరటం విశేషం.ఎన్టీఆర్ కథ, స్క్రీన్ ప్లే, ఆర్ట్, మేకప్, ఎడిటర్, నిర్మాత, దర్శకుడుగా, ద్విపాత్రలు, త్రిపాత్రాభినయం, పంచపాత్రలతో ఇలా బహుముఖ ప్రజ్ఞాశాలిగా ప్రపంచ సినిమా చరిత్రలోనే చరిత్ర కారుడు. ఇంకెవ్వరూ లేరు, మరెవ్వరూ రారు,ఇక సినిమా షూటింగ్ అంటే, లైట్ బాయ్ నుండీ నటినట దర్శక నిర్మాతలంతా, ఉదయమే ఒక్కనిమిషం ఆలస్యం కాకుండా సెట్ కు హాజరు కావలసిందే. నిర్మాత ఎంత చిన్నవాడైనా సరే లేచి నమస్కారం చేసి గౌరవించటం ఒక పద్ధతిగా , ఎందుకంటే నిర్మాతలే సినిమా యూనిట్ కు ఆధారం, వారిచ్చే పారితోషికం తోనే కదా పరిశ్రమ బాగుండేది అని నమ్మేవాడు. తన పారితోషికం కొంత అడ్వాన్సుగా, మిగతాది అగ్రిమెంట్ ప్రకారం ఖచ్చితంగా తీసుకునేవారు.ఏ కారణాల చేతనైనా అడ్వాన్సు ఇచ్చిన నిర్మాత, ఆ సినిమా వాయిదా పడినా, ఆగిపోయినా తిరిగి తీసుకున్న అడ్వాన్సు వాపసు ఇచ్చే అలవాటు లేదు కానీ అవసరం అనుకుంటే మళ్ళీ డేట్స్ ఇచ్చి, మరో సినిమాలో నటించేవారు. అలా నిర్మాతల బాగు కోరేవారు. వారికి ఎలాంటి, నష్టం, కష్టం కలిగించేవారు కాదు. కాల్షీట్ ప్రకారం అనుకున్న డేట్స్ కంటే ముందుగా సినిమా నిర్మాణం పూర్తి అయ్యేందుకు సహకరించే వారు. అంతేగాకుండా తనవద్ద పనిచేసే సాంకేతిక నిపుణులకు కాల్ షీట్లు



ఇచ్చి సినిమా నిర్మాణానికి, తగిన సహాయ సహకారాలు అందించి, నిర్మాణం పూర్తి చేసేవారు. షూటింగ్ విరామంలో మహిళా నటీమణులతో, ఇతర సినిమా వారితో పిచ్చపాటీ కబుర్లు, అనవసర చర్చలతో కాలక్షేపం చేయటం అలవాటు లేదు. తన సినిమా షూటింగ్ పూర్తి అయ్యాక, పౌరాణిక సినిమాలో తాను ధరించిన ఆభరణాలు, దుస్తులు, చేతిరుమాలు వరకూ నిర్మాతను అడిగి ఇంటికి తీసుకెళ్లేవారు. ఎందుకంటే “ఎన్టీఆర్ మ్యూజియం” ఏర్పాటు చేసి, రేపటి తరాలకు సినిమా ద్వారా భారతీయ సంస్కృతి చిహ్నాలుగా, పౌరాణిక, జానపద చిత్రాల ఆభరణాలు, దుస్తులు ఇతర వస్తువులు అందులో ప్రదర్శనకు ఉంచాలనే కోరిక ఉండేది. ఎన్టీఆర్ చాలా గంభీరంగా, రిజర్వుడు గా వుంటారు, సన్నిహితులు, ఆత్మీయులతో మాత్రం చాలా ఫ్రీ గా ఉండేవారు. పిల్లలతో ఆడుకోవటం బాగా ఇష్టం. తన మనసు చిన్నపిల్లాడి లాంటిది. నచ్చితే వారికోసం ఏమైనా చేయటం లేదా వారేం తప్పుచేసినా పట్టించు కునేవారు కాదు. ఎందరో కథనాయికలు, ఇతర ప్రముఖులను చిత్ర సీమకు పరిచయం చేశారు. ఫెయిల్యూర్ దర్శకులు, సంగీతం, పాటలు, మాటల రచయితలు, ఫోటోగ్రఫీ, హీరోయిన్లకు, కొత్త వారికి అవకాశాలు ఇచ్చేవారు. అన్ని విభాగాల్లో పట్టున్నవారు ప్రపంచ సినిమా చరిత్రలో ఎన్టీఆర్ ఒక్కరే.సినిమా రంగంలో ఎన్ని రాజకీయాలున్నా, వాటికి భిన్నంగా వ్యవహరించేవారు. అయితే ఒక్కసారి తనకు ఎవరైనా నచ్చితే వారేం చేసినా, చివరి దాకా వారితో స్నేహం కొనసాగించేవారు. తన సినిమా భవిష్యత్ కు ఎన్ని రకాల అవరోధాలు సృష్టించినా, సునాయాసంగా ఎదుర్కొనేవారు. మొండితనం, పట్టుదల, ఆత్మవిశ్వాసం, నమ్మకం, ప్రతిభ, తనమీద తనకు ఎక్కువ. ప్రయోగాలు చేయటం, భిన్నశైలిని అనుకరించటం, ఎన్టీఆర్ కు బాగా ఇష్టం.ఇక సినిమాల్లో పాత్రలు చూస్తే, తాను బికారిగా, మహారాజుగా, రారాజుగా, దేవుడిగా, రైతుగా, కూలిగా, డాక్టరు, కలెక్టరు, లాయరు, జడ్జి, పోలీస్, మిలిట్రీ ఆఫీసర్, విప్లవకారుడుగా నటిస్తే ఆపాత్రల్లో ప్రేక్షకులు లీనమయ్యేవారు.ఒక తండ్రి, తాత, అన్నా, తమ్ముడు, బాబాయి, మామయ్య, కొడుకు, భర్త, అల్లుడు, మరిది, బావ, స్నేహితుడు ఇలా నిజమైన పాత్ర లో కనిపించేవారు.అంతేనా రాముడు, కృష్ణుడు, రారాజు, రావణబ్రహ్మ, వెంకటేశ్వరుడు, శివుడు, యముడు, భీష్మ, భీమ,కర్ణ, అర్జున, బృహన్నల, కీచక, ఇంద్రజిత్ వంటి పురాణ పాత్రలు, వాల్మీకి, బ్రహ్మర్శి, వేమన, వీరబ్రహ్మం, రామానుజ, శంకరాచార్య, గౌతమబుద్ధ, వివేకానంద, వంటి కారణజన్ముల పాత్రలు, శ్రీనాథ, చాణుక్య, శివాజి, నేతాజీ, అల్లూరి, కట్టబ్రహ్మన, అశోక, బ్రహ్మనాయ,కృష్ణదేవరాయ,చంద్రగుప్త, హరిశ్చంద్ర,దుష్యంత వంటి చారిత్రాత్మక పాత్రధారిగా,ఎద్దుల బండి, లాగుడు బండి, సైకిల్, రిక్షా, టాక్సీ, లారీ వాలాగా, కర్రసాము, కత్తిసాము, కుస్తీ, గుర్రపుస్వారీ, వస్తాదు, యుద్ధాలతో థియేటర్లలో జనంలో ఈలలు, కేరింతలే. ఆఖరు దశాబ్దంలో మారిన ట్రెండుకు తగ్గట్లు పాటలు, స్టెప్పులు, డైలాగ్స్, కామెడీ తో కలెక్షన్ ల కనక వర్షం కురిపించాడు. 300 పైగా చిత్రాలు, వేశాలు, మారువేశాలు, విభిన్న వేశాలు కలిపి 350 పైగా పోషించి, తెలుగు, తమిళ, హిందీ, బెంగాలీ, ఒరియా, కన్నడ, గుజరాతి ఇతర భాషా చిత్రాల్లో నటించి, జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్ర పురస్కారాలందుకుని, ఉచ్ఛ స్థితిలో ఉండి, స్వచ్ఛందంగా 60 ఏళ్ళ వయసులో సినిమాలు చాలించి, ఇప్పటిదాకా తనను ఆదరించి ఇంతటి వాణ్ణి చేసిన ప్రజలకు సేవచేసి, వారి ఋణం తీర్చుకోవాలను కున్నారు. అంతే, ‘సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు’ అనే నినాదంతో ‘తెలుగు దేశం ‘ పార్టీ స్థాపించాడు. అనూహ్యంగా రాష్ట్రాధినేత కావటం, పాలనలో అనేక సంక్షేమ, అభివృద్ధి, సంస్కరణలు తెచ్చి, ఇచ్చిన హామీలు నెరవేర్చుతు, అన్ని వర్గాల వారికి అవినీతి రహిత సుభిక్ష పాలన, మహిళలకు ప్రత్యేకంగాఅన్నింట్లో సమాన భాగస్వామ్యం కల్పించి చరిత్ర తిరగరాశారు ఎన్టీఆర్.

ఎన్టీఆర్ కళామతల్లి ‘పుత్రరత్నం’, తెలుగుజాతి ‘భాషారత్నం’, సమాజ దేవాలయంలో ‘ప్రజారత్నం’, భారతీయ ‘నటరత్నం’, అనితరసాధ్య ‘విశ్వ సినీ రత్నం’, వీటన్నింటి సమ్మిళితమే “నభూతో నభవిష్యతి’ అనే “భారతీయరత్నం” , సర్వజనప్రేక్షక బాంధవుడు ఎన్టీఆర్.

**ఇంతటి బహుముఖప్రజ్ఞా వంతుడికేనా**


‘దాదా సాహెబ్ ఫాల్కె’ సినిమా వారసత్వ పురస్కారంతో ఇంకా గౌరవించ లేదంటే...ఏమనుకోవాలి? ఎన్టీఆర్ అంటే “నిష్కల్మషసినిరాజకీయ ప్రజారాధ్య జ్ఞానపుత్రుడు”గనుకనే ఎన్టీఆర్ కు భారత సర్వోన్నత

పీఠాధిపతులచే “విశ్వవిఖ్యాత నటసార్వభౌమ”,“అభినవ రామరాయ” సత్గౌరవ బిరుదాంకితులు, సద్భారతీయుడు నందమూరి తారక రామారావు. శతమహోత్సవవేళ ఎన్టీఆర్ కు “భారతరత్న”తో ‘శతంజలి’ నివాళిగా ప్రభుత్వం ప్రకటిస్తే భరతమాత ప్రభవిస్తుంది, తెలుగునేల ప్రణమిళ్ళుతుంది. విశ్వఖ్యాతి రెపరెప లాడుతుందని కలం కళాకాంక్ష.

**ఆకృతం : దాసన్నగారి కృష్ణమూర్తి**
**అర్పితం : శకపురుషుడు ఎన్టీఆర్ కు**

## నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు

**బెల్లంపల్లి వన్ టౌన్ ఇన్స్పెక్టర్ టి శంకరయ్య**




మంచిర్యాల బ్యూరో, బెల్లంపల్లి, మే 27, ప్రజాపాలన:నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బెల్లంపల్లి వన్ టౌన్ ఇన్స్పెక్టర్ టి శంకరయ్య హెచ్చరించారు. శనివారం బెల్లంపల్లి పట్టణం లోని సీడ్స్ , ఫెర్టిలైజర్స్ షాప్ లను వ్యవసాయ శాఖ అధికారులు, పోలీస్ సిబ్బంది తో కలిసి సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఆయా షాపులలో ఉన్నటువంటి స్టాక్ వివరములు , రికార్డులు పరిశీలించారు. నకిలీ విత్తనాలు, ఎరువులు గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి వన్ టౌన్ ఇన్స్పెక్టర్ టి శంకరయ్య షాప్ యజమానులకు నకిలీ విత్తనాలు, ఎరువుల విక్రయాలపై తగు సూచనలు సలహాలు చేశారు. ఈ తనిఖీలలో ఎస్సై టి. విక్టర్ , వ్యవసాయ శాఖ ఏడి సురేఖ లు పాల్గొన్నారు.

## ఘనంగా జవహర్లాల్ నెహ్రూ వర్ధంతి వేడుకలు




మధిర మే 27 ప్రజాపాలన ప్రతినిధి: దేశ మొదటి ప్రధాన మంత్రి లిజవహర్ లాల్ నెహ్రూ వర్ధంతిలి సందర్భంగా మధిర మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లిసూరంశెట్టి కిషోర్లి జవహర్ లాల్ నెహ్రూ చిత్రటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాట్లాడుతూభారతదేశానికి ప్రప్రథమ ప్రధానిగా పని చేసిన, జవహర్లాల్ నెహ్రూ దేశాన్ని బ్రిటీష్ కబంధహస్తాల నుంచి విడిపించేలా కీలక పాత్ర పోషించారు.క్విట్ ఇండియా ఉద్యమాన్ని చేపట్టి, జైలు పాలయ్యారు తన తిరుగుబాటు చర్యలతో ఆయన జైలు పాలు కావాల్సి వచ్చింది. ఉద్యమకాలంలో బ్రిటీష్ వారు ఆయనను జైలు పాలు చేసినా, నిర్బంధాలకు గురి చేసినా నిరాశ చెందక, దేశ వ్యాప్తంగా ర్యాలీలు చేపట్టి 1947 లో తెల్లవారి పాలన అంతమయ్యేలా కృషిచేశారు.దేశ స్వాతంత్ర్యానంతరం 1947 లో ప్రధానిగా ఎన్నికయి, 1964 లో మరణించేంత వరకూ ఆ పదవిలో కొనసాగారు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు లిదారా బాలరాజులి సైదల్లిపురం సర్పంచ్ లిపులి బండ్ల చిట్టిబాబులి సొసైటీ డైరెక్టర్ లిపత్తేపరపు సంగయ్యలి మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు లిబనావత్ వెంకటరమణా నాయక్లి పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు లిషేక్ జహంగీర్లి పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు లిబిట్రా ఉద్దండయ్యలి కాంగ్రెస్ నాయకులు లిఆవుల కిరణ్లి లిమాగం ప్రసాద్, బండారి నరసింహారావు, ఆదిమూలం శ్రీనివాసరావు, మైలవరపు చక్రి, జమీల్ పాషా, ఖలీల్, సయ్యద్ అమీర్లి మొదలగువారు పాల్గొన్నారు.

## టిపిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్రెడ్డి రంగారెడ్డిని కలిసిన నజ్దిక్ సింగారం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు



ఇబ్రహీంపట్నం మే తేది 27 ప్రజాపాలన ప్రతినిధి: యాచారం మండలం, నాజ్దిక్ సింగారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇబ్రహీంపట్నం ముద్దుబిడ్డ టిపిసిసి ఉపాధ్యక్షులు మాల్ రెడ్డి రంగారెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి, సింగారం గ్రామం లోని సమస్యలను వివరించడం జరిగింది, దానికి వారు సానుకూలంగ స్పందించి మీ వెంబడి నేను ఉంటాను మీరు ఎక్కడికి, ఎప్పుడు రమ్మన్నా నేను వస్తాను అని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు మహమ్మద్ షోయబ్, సామ నర్సింహా, మహమ్మద్ శాకీల్, నడ్డి విజయ్ కుమార్, చింతుల్ల జంగయ్య, చింతుల్ల సంజీవ, దార రవి, మండల శ్రీ రాములు, మండల రంగయ్య, దార దర్శన్, మహమ్మద్ అశ్వక్, సామ కృష్ణ, చింతుల్ల ప్రసాద్, బోయ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.


## లాస్ట్ 90 రోజుల్లో "ఆదిపురుష్" దే హవా.!




ప్రస్తుతం పాన్ ఇండియా మార్కెట్ దగ్గర భారీ హైప్ ఉన్న లేటెస్ట్ చిత్రాల్లో మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా సినిమా "ఆదిపురుష్" కూడా ఒకటి. మరి పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నుంచి మరో 1000 కోట్ల వసూళ్ల సినిమాగా రాబోతున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్ ని దర్శకుడు ఓంరౌత్ అయితే తెరకెక్కించాడు. ఇప్పుడు పలు అప్డేట్స్ ఈవెంట్స్ తో బిజీగా బిజీగా ఉన్న చిత్ర యూనిట్ లేటెస్ట్ గానే సెకండ్ సింగిల్ ని కూడా అనౌన్స్ చేసింది. ఇక ఈ అవైటెడ్ ప్రాజెక్ట్ అయితే ఇప్పుడు ఏ రేంజ్ లో హాట్ టాపిక్ గా ఉందో తెలుస్తుంది. మెయిన్ గా యూట్యూబ్ లో అయితే గత మూడు నెలలు నుంచి కూడా "ఆదిపురుష్" కోసవే ఆడియెన్స్ అంతా ఆసక్తిగా చూస్తున్నారట. ఈ 90 రోజుల్లో కూడా అత్యధికంగా వెతికిన టాపిక్ గా అయితే ఆదిపురుష్ ఇప్పుడు నిలిచింది. దీనితో యూట్యూబ్ అంతా కూడా ఆదిపురుష్ హవానే నడుస్తుంది అని చెప్పాలి. ఇక ఈ అవైటెడ్ సినిమా అయితే ఈ జూన్ 16న గ్రాండ్ గా పాన్ వరల్డ్ లెవెల్లో రిలీజ్ కాబోతుంది.

## 'మాస్ స్ట్రైక్'..మహేష్ తో త్రివిక్రమ్ ఊహించని మాస్ సంభవం.!

ప్రస్తుతం మన టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా దర్శకుడు త్రివిక్రమ్ తో అయితే తమ కాంబోలో చేస్తున్న హ్యాట్రిక్ సినిమా కోసం తెలిసిందే. దీనిపై కూడా సెన్సేషనల్ హైప్ ఉంది. మరి మహేష్ కోసం త్రివిక్రమ్ ఈసారి మరికాస్త కొత్తగా ట్రై చేస్తుండగా ఈ మే 31 ట్రీట్ కోసం అయితే ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇక ఈ ట్రీట్ కి ముందు అయితే మేకర్స్ ఈరోజు ఓ సాలిడ్ అప్డేట్ ఇస్తున్నట్టుగా మేకర్స్ అనౌన్స్ చేశారు. మరి ఈ సాలిడ్ అప్డేట్ అయితే ఇప్పుడు మేకర్స్ రివీల్ చేశారు. మరి ఓ ప్రీ లుక్ పోస్టర్ అన్నట్టుగా మహేష్ పై ఓ సూపర్ మాస్ పోస్టర్ ని మేకర్స్ ఇప్పుడు వదిలారు. చేతిలో బీడీ పెట్టుకొని తలకి ఎర్ర తువ్వాలుతో మహేష్ తో అయితే త్రివిక్రమ్ ఊహించని మాస్ సంభవంనే ప్లాన్ చేస్తున్నారని చెప్పాలి. మరి మాస్ స్ట్రైక్ అంటూ ఈ మే 31కి అయితే ఫ్యాన్స్ కి అదిరే ట్రీట్ ని ప్లాన్ చేస్తున్నట్టుగా ఈ పోస్టర్ తో కన్ఫర్మ్ చేశారు. ఇక ఆరోజు హైప్ ఎలా ఉంటుందో చూడాలి.




## కీర్తి..కృతి టాలీవుడ్ కి బైబై చెప్పేస్తున్నారా?

టాలీవుడ్ లో ఇప్పుడా భామలిద్దరి పరిస్థితి ఏం బాలేదా? అవకాశాల కోసం ఇతర పరిశ్రమలపై ఆధారపడాల్సి వస్తోందా? ఆ భామలు సైతం అక్కడే దృష్టి పెట్టారా? అంటే అవుననే తెలుస్తోంది. ఇంతకీ ఎవరా? ఇద్దరు భామలు అంటే? వివరాల్లోకి వెళ్లాల్సిందే. మాలీవుడ్ బ్యూటీ కీర్తి సురేష్ భారీ ఆశలతో టాలీవుడ్ లో కి అడుగు పెట్టింది. అవకాశాలు బాగానే వరించాయి. 'మహానటి' లాంటి సినిమా ఆమెకి దేశ వ్యాప్తంగా మంచి గుర్తింపు తీసుకొచ్చింది. కానీ అమ్మడి కెరీర్ ఆ తర్వాత అనుకున్నంత వేగం పుంజుకోలేదు. తాను ఒకటను కుంటే? సన్నివేశం మరోలా కనిపించింది. ఆ సినిమా తర్వాత స్టార్ హీరోలతో అవకాశాలు అందుకోవడానికి చాలా సాహసాలే చేసింది. అలా చేయగా చేయగా



చివరికి సూపర్ స్టార్ మహేష్ తో 'సర్కారు వారి పాట'లో నటించింది. ఆ తర్వాత కొన్ని సినిమాలు చేసింది. ఈ సమయంలో గ్లామర్ పాత్రల్లోనూ నటించడానికి సై అనేసింది. అవకాశాలు రాకపోయేసరికి రూల్స్ అన్నింటిని పక్కనబెట్టేసి కొత్త ప్రతిపాదనలు తీసుకొచ్చింది. అయినా సరే టాలీవుడ్ నో వే అనేసింది. ఇప్పటికీ కీర్తికి సరైన అవకాశాలు రాలేదు. ప్రస్తుతం చిరంజీవి హీరోగా నటిస్తోన్న 'భోళాశంకర్' లో ఆయనకు చెల్లి పాత్ర పోషిస్తుంది. అన్నా-చెల్లి సెంటిమెంట్ స్టోరీ అయినా? స్టార్ హీరోకి చెల్లి పాత్రకి పడిపోయిందంటే? మార్కెట్ లో డిమాండ్ పడిపోయినట్లుగానే ట్రేడ్ భావిస్తుంది. ప్రస్తుతం ఆ ఒక్క ఛాన్స్ మినహా కొత్త అవకాశాలేవి లేదు. ఇక 'ఉప్పెన'తో దూసుకొచ్చిన హాట్ బ్యూటీ కృతి శెట్టి టాలీవుడ్ లో నెంబర్ వన్ అవుతుందని అంతా అంచనా వేసారు. కానీ ఆ లెక్కలు తప్పాయి. వరుస వైఫల్యాలు అమ్మడిని రేసులో వెనక్కి నెట్టాయి. టైర్ 2 హీరోలతో కొన్ని సినిమాలు చేయడానికే సాహసించాల్సి వచ్చింది. ఇప్పుడున్న పరిస్థితుల్లో టైర్ వన్ హీరోలతో ఛాన్స్ అంటే అంత ఈజీ కాదు. జాన్వీ కపూర్.. దీపికా పదుకొణే..అలియా భట్ ...కియారా లాంటి భామలు పోటీని తట్టుకుని టాలీవుడ్ లో దూసుకు రావడంతో! కష్టమనే తెలుస్తుంది. దీంతో ఇద్దరు భామలిప్పుడు తమిళ..మలయాళ.. కన్నడ భాషలపై దృష్టిపెడుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం మాలీవుడ్ లో ఓ సినిమా చేస్తుంది కృతి. కొన్ని చిత్రాలకు సైన్ చేయాల్సి ఉంది. అలాగే కీర్తి ఏకంగా ఐదారు తమిళ సినిమాలు చేస్తుంది. ఈ సంకేతాలే ఆ భామలి ద్దర్నీ టాలీవుడ్ కి దూరం చేస్తున్నాయా? అన్న సందేహాన్ని బలపరుస్తున్నాయి.

## సమంత అన్ స్టాపబుల్ కాంబో..?

స్టార్ హీరోయిన్ సమంత ప్రస్తుతం మళ్లీ తన పూర్తి ఫోకస్ అంతా సినిమాల మీద పెడుతుంది. పర్సనల్ ప్రొఫెషనల్ ఇలా అన్ని విభాగాల్లో మ్యాటర్ లను సెటిల్ చేసుకున్న సాం ఇక మీదట ఎలాంటి గ్యాప్ లేకుండా సినిమాలు చేయాలని ఫిక్స్ అయ్యింది. త్వరలో విజయ్ దేవరకొండతో ఖుషి సినిమాతో రాబోతున్న సమంత ఆ సినిమా తర్వాత ప్రాజెక్ట్ ఫిక్స్ చేసుకుంది. సమంత నెక్స్ట్ సినిమా ఇంట్రెస్టింగ్ కాంబోలో రాబోతుందని తెలుస్తుంది. అదేంటి అంటే డీజే టిల్లుతో స్టార్ బోయ్ క్రేజ్ తెచ్చుకున్న సిద్ధు జొన్నలగడ్డ హీరోగా సమంత హీరోయిన్ గా ఒక సినిమా వస్తుందట. ఈ సినిమాను ఎస్.ఆర్.టి ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ లో రామ్ తాళ్లూరి నిర్మిస్తారని తెలుస్తుంది. ఈ సినిమాను నందిని రెడ్డి డైరెక్ట్ చేయబోతున్నారు. రీసెంట్ గా అన్నీ మంచి శకునములే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన నందిని రెడ్డి సమంతతో మరో సినిమా ఫిక్స్ చేసుకుంది. ఆల్రెడీ సమంతతో జబర్దస్త్ ఓ బేబీ సినిమాలు చేసిన నందిని రెడ్డి హ్యాట్రిక్ సినిమా చేసింది. ఇక ఈ సినిమాకు కథ %దీఎూ% రవి అందిస్తున్నారని టాక్. బివిఎస్ మూల కథ అందించగా ఆ కథతోనే నందిని రెడ్డి సినిమా ఉండబోతుందని అర్థమవుతుంది. బివిఎస్ రవి ఈమధ్య బాలకృష్ణ అన్ స్టాపబుల్ కి కాన్సెప్ట్ రైటర్ గా వర్క్ చేశారు. బాలయ్య బాబు షో సక్సెస్ అవడంతో మళ్లీ ఫామ్ లోకి వచ్చారు బివిఎస్ రవి. డైరెక్టర్ గా కూడా రెండు ప్రయత్నాలు చేసిన బివిఎస్ రవి ప్రస్తుతం సినిమాలకు కథలు ఇస్తూ కెరీర్ కొనసాగిస్తున్నారు. డీజే టిల్లు సినిమాతో సూపర్ పాపులర్ అయిన సిద్ధు కెరీర్ విషయంలో చాలా జాగ్రత్తగా ఉంటున్నాడు. ఆల్రెడీ టిల్లు స్క్వేర్ సెట్స్ మీద ఉంది. లేటెస్ట్ గా సమంతతో సినిమా ఫైనల్ అయ్యింది. ఈ సినిమా తప్పకుండా సిద్ధు కెరీర్ కి బాగా హెల్ప్ అవుతుందని చెప్పొచ్చు. ఈ సినిమాకు సంబంధించిన అఫీషియల్ అనౌన్స్మెంట్ త్వరలో రాబోతుందని తెలుస్తుంది. సిద్ధు తో సమంత రొమాన్స్ ఎలా ఉండబోతుందో చూడాలి. ఈ సినిమాతో పాటుగా సమంత బాలీవుడ్ వెబ్ సీరీస్ లతో కూడా ఆడియన్స్ ని అలరించడానికి రెడీ అవుతుంది. తెలుగులో స్టార్ హీరోల సినిమాలే కాదు యంగ్ హీరోలతో కూడా కలిసి జత కట్టేందుకు సై అనేస్తుంది. సో ఈ విధంగా వరుస సినిమాలతో దూసుకెళ్తుంటే సమంత కెరీర్ ఎప్పటికీ అన్ స్టాపబుల్ అనిపించేలా ఉంది.



## ఆ టాప్ డైరెక్టర్తో నాని పాన్ ఇండియా మూవీ

తెలుగులో టాలెంట్ ఉన్న హీరోలు చాలా మందే ఉన్నారు. అందులో ముందుగా చెప్పుకోవాల్సిన పేర్లలో నేచురల్ స్టార్ నాని ఒకటి. అంతలా ఇతగాడు సుదీర్ఘ కాలంగా తనదైన సహజసిద్ధమైన నటనతో తెలుగు ప్రేక్షకులను ఫిదా చేస్తోన్నాడు. అంతేకాదు ఎన్నో సినిమాలను వన్ మ్యాన్ షోలుగా మార్చుకుని విజయాలను కూడా సొంతం చేసుకుని కెరీర్ను సక్సెస్ఫుల్గా తీసుకెళ్తోన్నాడు. హిట్లు ఫ్లాపులతో సంబంధం లేకుండా సినిమాలు చేసే నేచురల్ స్టార్ నాని.. ఈ ఏడాది 'దసరా' అనే పాన్ ఇండియా చిత్రంతో వచ్చాడు. దీనికి అన్ని ఏరియాలు భాషల్లో భారీ రెస్పాన్స్ రావడంతో సూపర్ డూపర్ హిట్ అయింది. ఈ ఉత్సాహంతోనే ఇప్పుడు తన 30వ



సినిమాను కూడా చేస్తోన్నాడు. కొత్త దర్శకుడు తెరకెక్కించే ఈ చిత్రం షూటింగ్ ఎంతో వేగంగా సాగుతోంది. ఇప్పటికే ఓ సినిమా షూటింగ్లో పాల్గొంటోన్న నాని.. ఇప్పుడు మరో క్రేజీ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. దీన్ని తెరకెక్కించేది మరెవరో కాదు.. 'దృశ్యం' సిరీస్తో దేశం మొత్తం తనవైపు తిరిగి చూసేలా చేసుకున్న మలయాళ దర్శకుడు జీతూ జోషెఫ్. అవును.. అక్కడ స్టార్ డైరెక్టర్గా సత్తా చాటుతోన్న ఆయన.. త్వరలోనే నానితో ఓ పాన్ ఇండియా సినిమా చేస్తున్నారట. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం.. ఇటీవలే నేచురల్ స్టార్ నాని – మలయాళ బడా డైరెక్టర్ జీతూ జోసెఫ్ సమావేశం అయ్యారట. ఇందులో ఆయన ఓ క్రైమ్ థ్రిల్లర్ స్టోరీని వినిపించారని తెలిసింది. ఇది నానికి బాగా నచ్చడంతో వెంటనే ఓకే చేసేశాడని అంటున్నారు. ఇక ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రకటన అతి త్వరలోనే రాబోతుందని ఫిలిం నగర్లో ప్రచారం జరుగుతోంది. మరోవైపు.. నానికి జీతూ జోసెఫ్ తన మలయాళ సినిమా 'కూమన్: ది నైట్ రైడర్' కథను కూడా వినిపించినట్లు వార్తలు వస్తున్నాయి. దీన్ని తెలుగులోకి రీమేక్ చేయడానికి ఆయన ప్రయత్నిస్తున్నారని ఇందులో భాగంగానే నానిని కలిసి చర్చలు జరిపారని కూడా అంటున్నారు. మొత్తానికి ఈ సినిమానో కొత్త కథతోనో వీళ్లిద్దరూ ప్రాజెక్టును చేయడం ఖాయంగా కనిపిస్తోంది.

## ప్రభాస్ తో త్రివిక్రమ్ మాసివ్ ప్రాజెక్ట్.?



ప్రస్తుతం మన టాలీవుడ్ సినిమా దగ్గర ఫుల్ బిజీగా ఉన్న స్టార్ హీరోస్ లో పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ కూడా ఒకరు. మరి ప్రభాస్ ఇపుడు అనేక సినిమాలకు ఒకే చేసి ఆల్రెడీ కొన్ని రిలీజ్ కి కొన్ని షూటింగ్ లో కూడా బిజీగా ఉన్నాయి. అంతే కాకుండా ఇంకా ఒకే చేయాల్సిన చిత్రాలు కూడా ఉన్నాయి. ఇక ఈ లైనప్ లో అయితే లేటెస్ట్ గా మరో క్రేజీ రూమర్ ఒకటి బయటకి వచ్చింది. ప్రభాస్ తో ఇప్పుడు మాటల మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ అయితే ఓ భారీ చిత్రం ప్లాన్ చేస్తున్నట్టుగా రూమర్స్ మొదలయ్యాయి. అయితే త్రివిక్రమ్ ఇప్పటివరకు తాను గాని ప్రభాస్ గాని చేయని ఓ సరికొత్త సబ్జెక్టు అయితే డార్లింగ్ కి నరేట్ చేసినట్టుగా తెలుస్తుంది. మరి ఈ ఇంట్రెస్టింగ్ కాంబో ఎంతవరకు నిజం అనేది కాలమే నిర్ణయించాలి. ప్రస్తుతం త్రివిక్రమ్ అయితే మహేష్ సినిమాతో బిజీగా ఉన్నారు.




Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989